నిర్భయవార్త తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY




సంపుటి : 13 సంచిక : 126 రంగారెడ్డి | శుక్రవారం 04 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 04-09-2026 | September | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To:Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada

# బర్త్ ట్రావెల్ ఆర్డర్‌పై..
# ట్రంప్‌కు షాక్

**కొత్త ఉత్తర్వుల అమలును నిలిపివేసిన ఫెడరల్ కోర్టు**

## పౌరసత్వ హక్కులకు భంగం కలుగుతుందన్న వలసదారుల పిటిషన్




నిర్భయవార్త ప్రతినిధి : అమెరికాలో పుట్టిన పిల్లలకు పౌరసత్వం కల్పించే నిబంధనలను పరిమితం చేయాలన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నానికి మరోసారి న్యాయస్థానం అడ్డుకట్ట వేసింది. 'బర్త్ టూరిజం'ను కట్టడి చేసే పేరుతో ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఉత్తర్వుల అమలును మేరీల్యాండ్ ఫెడరల్ కోర్టు నిలిపివేసింది. జడ్జి డెబోరా బోర్డ్‌మన్ ప్రాథమిక ఇంజంక్షన్ జారీ చేస్తూ.. ఉత్తర్వులను అమలు చేయరాదని స్పష్టం చేశారు. అమెరికా పౌరులు లేదా గ్రీన్‌కార్డు హోల్డర్లు కాని విదేశీయులకు పుట్టే పిల్లలకు పౌరసత్వం నిరాకరించేలా ట్రంప్ గతంలో జారీ చేసిన ఆదేశాలను సుప్రీంకోర్టు జూన్ 30న తప్పుపట్టింది. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం దేశ భూభాగంలో జన్మించిన వారికి పౌరసత్వం కల్పించే నిబంధనలకు ఆ ఆదేశాలు విరుద్ధమని పేర్కొంది. అయినప్పటికీ ట్రంప్ ప్రభుత్వం ఆగస్టు 6న 'బర్త్ టూరిజం'పై మరో ఉత్తర్వును తీసుకొచ్చింది. తమ పిల్లలకు అమెరికా పౌరసత్వం దక్కాలనే ఉద్దేశంతో ప్రసవానికి ముందు అమెరికాకు వచ్చే వారిని లక్ష్యంగా చేసుకుని పలు పరిమితులు విధించింది. విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, మోసపూరిత మార్గాల్లో పౌరసత్వం పొందేందుకు ప్రయత్నించే వారి పిల్లలు, కొన్ని 'శత్రు దేశాల' పౌరుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించే నిబంధనలు అందులో ఉన్నాయి.

### సెప్టెంబర్ 5 వరకు ఆగాల్సిన పనిలేదు

కొత్త ఉత్తర్వులపై వలసదారుల హక్కుల సంఘాలు కోర్టును ఆశ్రయించాయి. చిన్నారుల పౌరసత్వ హక్కులకు భంగం కలుగుతుందని వాదిస్తూ క్లాస్ యాక్షన్ పిటిషన్ దాఖలు చేశాయి. ప్రభుత్వ వాదనలను తిరస్కరించిన కోర్టు.. ఉత్తర్వుల అమలుపై తక్షణమే స్టే విధించింది. కొత్త నిబంధనల అమలుకు సెప్టెంబర్ 5 వరకు మార్గదర్శకాలు సిద్ధం చేస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ.. అప్పటివరకు వేచి ఉండటం సరికాదని న్యాయస్థానం స్పష్టం చేసింది.

# ప్రజాప్రభుత్వంలో విప్లవాత్మక పాలన

హైదరాబాద్ ప్రజా పాలన ప్రభుత్వంలో వెయ్యి రోజుల్లో రవాణా రంగంలో అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహిళా సాధికారత, ఉద్యోగ సంక్షేమం, ఆధునిక ప్రజా రవాణాకు పెద్దపీట వేశామని గుర్తు చేశారు. 2,932 కొత్త బస్సులు కొనుగోలు చేశామనీ, 1,024 ఎలక్ట్రిక్ బస్సులతో సేవలు అందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు త్వరలో రోడ్డెక్కనున్నాయన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో రవాణా శాఖ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, జేటీసీ చంద్రశేఖర్ గౌడ్‌తో కలిసి వెయ్యి రోజుల ప్రజాపాలన పూర్తైన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీని దేశంలోనే నంబర్-1గా నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విజన్ 2047 కి అనుగుణంగా ఆర్టీసీ మరింత ముందుకు పోతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు 347.36 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారనీ, తద్వారా మహిళలు సుమారు రూ.12,167 కోట్లు ఆదా చేసుకున్నారని చెప్పారు. మహిళలను కేవలం ప్రయాణికులుగా కాకుండా రవాణా రంగంలో యజమానులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా సెర్ఫ్, మహిళా సంఘాల ద్వారా 600 బస్సులను కొనుగోలు చేయించి వాటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించామని మంత్రి తెలిపారు. ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నామనీ, ఎన్నికల్లో గెలిచిన ప్రతినిధులతో అధికారుల కమిటీ ఏర్పాటు చేసి విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని చెప్పారు. హైదరాబాద్ నగరంలో 370 కొత్త రూట్లలో బస్సు సర్వీసులు నడుపుతున్నామనీ, గ్రామాల్లోనూ ఇప్పటివరకు బస్సు సౌకర్యం లేని ప్రాంతాలకు సర్వీసులను విస్తరిస్తున్నామని చెప్పారు. **4లో..)**

# ధిక్కారమే ఆమె నైజం!

- మంత్రిగా ఉంటూనే సీఎంలపై ఎదురుదాడి
- నాడు రోశయ్య.. నేడు రేవంత్
- అధిష్ఠానం ఆగ్రహానికి గురవుతున్న కొండా సురేఖ



**ఉమ్మడి వరంగల్,** నిర్భయవార్త ప్రతినిధి : వివాదాస్పద వ్యాఖ్యలు, సొంత పార్టీ నాయకత్వంపైనే ఎదురుదాడి చేయడం.. కొండా సురేఖ రాజకీయ ప్రస్థానంలో తరచూ కనిపించే పరిణామాలు. మంత్రిగా ఉంటూనే ముఖ్యమంత్రులను బహిరంగంగా ప్రశ్నించిన సందర్భాలు ఆమె రాజకీయ జీవితంలో ఉన్నాయి. నాడు కొణిజేటి రోశయ్య..నేడు రేవంత్‌రెడ్డి.. ఇలా సీఎంలతో విభేదాలు సురేఖను పలుమార్లు వివాదాల్లోకి నెట్టాయి. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న సురేఖ ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేశారు. 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న ఆమె.. ఆయన మరణానంతరం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొణిజేటి రోశయ్యపై బహిరంగంగా విమర్శలు చేశారు. జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలంటూ అప్పటి కాంగ్రెస్ అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారు. చివరకు మంత్రి పదవికి రాజీనామా చేయడంతో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేశారు.

### పార్టీ మారినా.. తీరు మారలేదా?

అనంతరం వైఎస్సార్‌సీపీ, టీఆర్ఎస్‌లో కొనసాగిన సురేఖ 2018లో తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. 2023 ఎన్నికల్లో వరంగల్ తూర్పు నుంచి గెలుపొంది రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల బాధ్యతలు చేపట్టారు. అయితే మంత్రిగా ఉంటూనే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సహచర నేతలపై విమర్శలు చేయడం, ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యవహారశైలిని ప్రశ్నించడం వంటి పరిణామాలు పార్టీలో విభేదాలకు దారితీశాయి. తాజాగా కుమార్తె సుస్మిత వ్యాఖ్యల వ్యవహారం సురేఖను మరోసారి వివాదంలోకి నెట్టింది. ఈ వ్యవహారంపై పార్టీ క్రమశిక్షణ చర్యలు, అధిష్ఠానం పిలుపుతో వివాదం మరింత ముదిరింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సురేఖ చేసిన బహిరంగ వ్యాఖ్యలు కాంగ్రెస్ అధిష్ఠానానికి ఆగ్రహం తెప్పించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



# కాలువల్లో నీళ్లు లేవు..
# తుమ్మ చెట్లే!

## రేవంత్‌కు హరీశ్‌రావు సెల్ఫీ చాలెంజ్

- 85 శాతం పూర్తయిన టన్నెల్‌లో మిగిలింది 300 మీటర్లే..
- ₹50 కోట్లతో 50 వేల ఎకరాలకు నీరు

**ఉమ్మడి మెదక్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, కాలువల పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ఆరోపించారు. కాలువల్లో నీళ్లు పారాల్సిన చోట తుమ్మ చెట్లు మొలుస్తున్నాయని ఎద్దేవా చేశారు. గురువారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి రెడ్డిపల్లి వద్ద ఆగిపోయిన మల్లన్నసాగర్-కాళేశ్వరం కాలువ పనులను పరిశీలించిన ఆయన.. కాలువలో మొలిచిన తుమ్మ చెట్ల వద్ద నిలబడి సీఎం రేవంత్‌రెడ్డికి సెల్ఫీ చాలెంజ్ విసిరారు.**

నిర్భయవార్త ప్రతినిధి :

### 300 మీటర్లు పూర్తయితే నీళ్లు

మల్లన్నసాగర్ నుంచి నర్సాపూర్, ఆందోల్, సంగారెడ్డి ప్రాంతాలకు సాగునీరు అందించేలా కేసీఆర్ హయాంలో చేపట్టిన 18 కిలోమీటర్ల టన్నెల్ పనుల్లో 85 శాతం పూర్తయ్యాయని హరీశ్‌రావు తెలిపారు. కేవలం 300 మీటర్ల పనులు మిగిలి ఉన్నాయని, వాటిని పూర్తి చేస్తే నీరు హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్ వరకు చేరే అవకాశం ఉండేదన్నారు. మెదక్, నిజామాబాద్ జిల్లాల రైతులకు ప్రయోజనం కలిగేదని పేర్కొన్నారు.



### రూ.50 కోట్లతో 50 వేల ఎకరాలు

మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ కింద పిల్ల కాలువల పనులకు రూ.50 కోట్లు కేటాయిస్తే సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని హరీశ్‌రావు అన్నారు. బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టులు, ఘనపురం ఆనకట్ట ఎత్తు పెంపు, దుబ్బాక లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.

### 'మెదక్‌పై ఎందుకంత చిన్నచూపు?'

ఉమ్మడి మెదక్ జిల్లాపై సీఎం రేవంత్‌రెడ్డి చిన్నచూపు చూస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు వచ్చే అవకాశం ఉన్నా రిజర్వాయర్లను నీటితో నింపేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో ఒక్క గజం కాలువ కూడా తవ్వలేదని, నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టుల పనులను తక్షణమే ప్రారంభించాలని, మల్లన్నసాగర్ నుంచి నర్సాపూర్, ఆందోల్‌కు నీటిని తీసుకెళ్లే కాలువను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టుల భూసేకరణకు నిధులు విడుదల చేసి, నిలిచిపోయిన టన్నెల్, కాలువ పనులను వెంటనే చేపట్టాలని కోరారు. కాలువల్లో పెరిగిన తుమ్మ చెట్ల వద్ద తీసుకున్న సెల్ఫీని సీఎం రేవంత్‌రెడ్డికి ట్యాగ్ చేస్తున్నానని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని హరీశ్‌రావు అన్నారు.

నిర్భయవార్త
సంపాదకీయం
శుక్రవారం 04 సెప్టెంబర్ 2026

# ముప్పు ముంగిట....!

నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదలను కేవలం ఒక దేశంలో జరిగిన ప్రకృతి విపత్తుగా చూడటం ఇక ఏ మాత్రం సాధ్యం కాదు. ఇది హిమాలయ ప్రాంతం నుంచి ప్రారంభమయ్యే వరద ముప్పు, నదీ ప్రవాహాల ద్వారా మైదాన ప్రాంతాలకు చేరి చివరకు తీర ప్రాంతాల వరకు ప్రభావం చూపే విస్తృత వాతావరణ సంక్షోభానికో నిదర్శనం. ఈ సమయంలోనే సముద్ర మట్టాల పెరుగుదలపై ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదిక ముప్పు ముంగిట నిలిచిన మానవాళికి మరో హెచ్చరిక! 2014--2023 మధ్య ప్రపంచ సగటు సముద్ర మట్టం పెరుగుదల సంవత్సరానికి 4.7 మి.మీ. ఉండగా, 2024లో అది 5.9 మి.మీ.కు చేరిందని ఈ నివేదిక పేర్కొంది. ఈ నివేదికలోని అంశాలు మన దేశానికి ఎంతో కీలకమైనవి. ఈ నివేదిక ప్రకారం దక్షిణాసియాలోని తక్కువ ఎత్తులో ఉన్న డెల్టా ప్రాంతాల్లో నివసిస్తున్న 1.4 కోట్ల మందికి పైగా ప్రజలు ముంపు ముప్పును ఎదుర్కొంటున్నారు. ముంబై, కోల్‌కతా వంటి మహా నగరాలకు ఈ సమస్య మరింత తీవ్రంగా ఎదురుకానుంది. సముద్ర మట్టం పెరగడం అంటే కేవలం జనావాసాల్లోకి నీరు రావడం మాత్రమే కాదు. ఇళ్లను కోల్పోవడం, ప్రజలు స్థానభ్రంశం చెందడం, తాగునీటి వనరుల్లోకి ఉప్పునీరు చొరబడటం, వ్యవసాయ భూములు దెబ్బతినడం, పారిశుధ్యం--ఆరోగ్య వ్యవస్థలపై ఒత్తిడి పెరగడం, కొన్ని సమయాల్లో ప్రాణనష్టం సంభవించడం వంటి అనేక సంక్షోభాలకు దారితీస్తుంది. ముందస్తు హెచ్చరికల వ్యవస్థకు అందకుండా విరుచుకుపడే రాకాసి అలలు సృష్టించే భయోత్పాతం ఇంతా అంతా కాదు! సుదీర్ఘ తీరప్రాంతంగల మన రాష్ట్రానికి ఈ హెచ్చరికల ప్రాధాన్యత ఏమిటో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. రాష్ట్రంలోని 1,028 కిలోమీటర్ల తీరరేఖలో సుమారు 32 శాతం తీరం కోతకు గురవుతోందని ఇప్పటికే వివిధ అధ్యయనాలు చెబుతున్నాయి. కాకినాడ, పశ్చిమ గోదావరి, కృష్ణా, నెల్లూరు జిల్లాలో కోత తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. కృష్ణా, ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాలను కేంద్రం అత్యంత సున్నిత తీర జిల్లాలుగా గుర్తించింది. కృష్ణా జిల్లాలోని 23 తీర గ్రామాలు ముంపు ప్రమాదంలో ఉన్నాయి. అంతర్వేది వద్ద గోదావరి నది సముద్రంలో కలిసే ప్రాంతంలో తీర కోత తీవ్రంగా ఉంది. విశాఖపట్నం జిల్లాలో యారాడ, భీమునిపట్నం , శ్రీకాకుళం జిల్లాలో కళింగపట్నం, నెల్లూరు జిల్లాలో కృష్ణపట్నం పోర్టు వద్ద కోత ముప్పు, సముద్ర మట్టాల పెరుగుదల ప్రభావాలు తీవ్రంగా ఉన్నాయని అనేక నివేదికలు చెబుతున్నాయి. ఒక అధ్యయనం ప్రకారం చెన్నై- విశాఖపట్నం మధ్య 1995-2020 సంవత్సరాల్లో సముద్ర మట్టం సంవత్సరానికి 4.5 మి.మీ. మేర పెరిగింది. ఇది ప్రపంచ సగటు కంటే ఎక్కువ.వాస్తవానికి హిమాలయాల నుంచి సముద్ర తీరం వరకు వాతావరణ ముప్పులు పరస్పరం అనుసంధానమై ఉన్నాయి. సముద్ర మట్టం పెరుగుదల, తీర కోత, ఆకస్మిక వరదలు వేర్వేరు సమస్యలు కావు. మారుతున్న వాతావరణ వ్యవస్థలో ఒకదానితో మరొకటి ముడిపడిన సంక్షోభాలే! పెను ముప్పులు విరుచుకుపడుతున్న ప్రస్తుత సమయంలోనూ తీర ప్రాంతాన్ని, ఓడరేవులను కార్పొరేట్లకు కట్టబెట్టడమంటే ప్రమాదాన్ని మరింతగా పెంచడమే! ఆ తరహా చర్యలను ప్రభుత్వాలు తక్షణం మానుకోవాలి. అదే సమయంలో విపత్తు సంభవించినప్పుడు సహాయక చర్యలు చేపట్టడానికే పరిమితమైతే సరిపోదు. శాస్త్రీయ మ్యాపింగ్, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, వరద ప్రవాహాల నిరంతర పర్యవేక్షణ, ప్రమాద ప్రాంతాల్లో నిర్మాణాల నియంత్రణ, తీర పర్యావరణ వ్యవస్థల పరిరక్షణ వంటి చర్యలను తక్షణం చేపట్టాలి. రాష్ట్రంలో ఇప్పటికే ప్రతిపాదించిన గ్రీన్ వాల్ వంటి కార్యక్రమాలను మాటలకే పరిమితం చేయకుండా అమలులోకి తీసుకురావాలి. 'ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది తీర ప్రాంతాల్లోనూ, తక్కువ ఎత్తులోనూ నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరద ముప్పు భవిష్యత్ తరాలకు సంబంధించిన సమస్య ఎంత మాత్రం కాదు. ఇది ఇప్పటికే మన ముందుకు వచ్చిన ప్రమాదం' అని తాజా నివేదికలో ఐక్యరాజ్యసమితి చేసిన హెచ్చరిక పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రభుత్వాలు కూడా ఆ స్ఫూర్తితోనే స్పందించాలి.

# గురు-శిష్యుల దారొకటే కదా?

సిజెపి అనే 'కాక్రోచ్ జనతా పార్టీ' అదేనండీ యుద్ధం చేస్తున్న బొద్దింకల పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిషేక్ దీప్కేపై ఇప్పుడు విశ్వవ్యాపితంగా ఫోకస్ నడుస్తున్నది. అంతర్జాతీయ మీడియా కూడా కథనాలు రాస్తున్నది. సిజెపి నేతలకు రాజకీయాలున్నాయా? వుంటాయా? అని పరిశీలనలు సాగుతున్నాయి. ఇప్పటికైతే ఆ ఆలోచన లేదనీ రేపు ఏం జరిగేదీ చెప్పలేమని గతంలో దీప్కే, సౌరవ్ వంటి వారు చెప్పివున్నారు. అయినా అలాంటి మ్యాటర్లంటే మన మీడియా సోదరులకు బోలెడు క్యూరియాసిటీ కదా. ఒక పట్టాన వదలిపెడతారా? వారి సంగతి అలా వుంచి వారి తరపున నిరాహారదీక్ష చేసి ఉత్కంఠ పెరగడానికి కారణమైన సోనమ్ వాంగ్ చుక్‌ను అడిగారు. 'నాకైతే అలా అని పించలేదు గానీ అదేం తప్పు కాదు కదా!' అని ఆయనన్నారు. వీరిలో చాలామంది గతంలో ఆప్‌తో కలసి పనిచేశారనేది ఇంత చర్చకు ఒక కారణం. కాకుంటే సౌరవ్ వంటి వారిలో కొంత రాజకీయ ఆసక్తి గమనించానని వాంగ్ చుక్ చెప్పారు. దీనిపై దీప్కేను అడిగినప్పుడు ఆయన కూడా అదే విధంగా స్పందించారు. 'రాజకీయాల్లోకి వెళ్లడం తప్పు కాదుగానీ మా ఆలోచనలో అది లేద'ని స్పష్టం చేశారు. ఈ తరుణంలోనే మరో ముక్క అనడంతో మనం ఇది చెప్పుకోవలసి వచ్చింది. ప్రధాని మోడీ ఆర్‌ఎస్‌ఎస్ కంటే ఎక్కువని ఊహించుకుంటున్నారని అభిషేక్ వ్యాఖ్యానించారు. నిరసన తెల్పవచ్చునని ఆర్‌ఎస్‌ఎస్ బాస్ మోహన్ భగవత్ అన్న మాట మోడీ పట్టించుకోలేదన్నారు. జెన్ జీ ని సందేహించాల్సిన పని లేదనీ వారితో సంబంధం పెట్టుకోవలసి వుందని కూడా భగవత్ చెప్పిన మాట మోడీ చెవికెక్కలేదని కూడా దీప్కే అన్నారు. ఇక్కడ విశేషమేమంటే నిజంగా మోహన్ భగవత్ ఏదో మోడీ సర్కారును కాపాడేందుకు చక్రం అడ్డం వేయడమేగానీ నిజంగా అంత సహనం బోధించేవారేమీ కాదు. అలా అయితే మోడీ కూడా ఆర్‌ఎస్‌ఎస్ ప్రచార రత్నంగా పనిచేసిన వారే కదా? వంద నాల్కలతో పరిపరి విధాల మాట్లాడే పరివార్ బుద్ధిని బొద్దింక కింగ్ పసిగట్టలేదా? ఇకపోతే విద్యార్థులపై ఎఫ్ఐఆర్ లు ఎత్తివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించడం గొప్ప విజయమని అభినందనలు వెలువడుతున్నాయి. అంతవరకూ మంచిదే గానీ తీవ్రమైన నేరాలు చేశారనే పేరిట 2900 మందిపైన కేసులు కొనసాగించడానికి న్యాయస్థానం అనుమతినిచ్చింది. జంతర్ మంతర్‌లో అంత నేరాలు వారేం చేస్తారు? ఈ మినహాయింపును ఏలినవారు ఎలా దుర్వినియోగం చేస్తారో వేరే చెప్పాలా? ఆ మాటకొస్తే ఐషీ ఘోష్‌ను అరెస్టు చేయడానికి ఎకెజి భవన్‌కు వచ్చింది కూడా పాత కేసులోనే అన్నారు కదా. అందువల్ల కథ మిగిలే వుందని గుర్తించి ట్విస్టుల కోసం వెయిటింగ్ చేద్దాం.



**దళాలూ... దళపతులూ...**

వారిజాక్షులందు వైవాహికములందు, ప్రాణవిత్త మాన భంగమందు.. బొంక వచ్చునంటూ పోతన కట్టిన శుక్రనీతి పద్యంలో చాలా మీనింగుంది. ఇక నవీన కాలపు పాలిటిక్సుకు ఇది మరెంతగా వర్తించాలి? ఇవన్నీ ఎలా వున్నా అధికారం అనేదానికోసం ఏం చేసినా తప్పు లేదనేది నేటి పాలకవర్గ అధినేతల దృష్టి. తమిళనాడులో అరవయ్యేళ్లుగా అధికారానికి దూరంగా నిరీక్షిస్తున్న కాంగ్రెస్ నేతలు ఆగమేఘాల మీద డిఎంకె ను వదలిపెట్టి దళపతి విజయ్‌తో కలసి సర్కారులో చేరారంటే అదే కదా కారణం. అయితే ఇప్పుడు వారికో ధర్మ సంకటం వచ్చి పడింది. ఏమంటే 'ఇండియా టుడే', 'సి ఓటరు' సర్వేలో సి.ఎం విజయ్ ప్రధాని రేసులో మూడో స్థానంలో వున్నట్టు వచ్చింది. దాంతో టివికె చెలరేగిపోయింది. రాహుల్‌ను ప్రధానిని చేయడమే జీవిత లక్ష్యమని వై.ఎస్ రాజశేఖరరెడ్డి నుంచి రేవంత్ రెడ్డి వరకూ రోజూ రామకోటి రాయడం మనకు తెలుసు కదా. అన్ని చోట్లా ఆ పార్టీ తీరు అదే కదా. మరి మోడీ ప్లేసులో రాహులుడు వచ్చేస్తాడని ముచ్చట పడుతున్న హస్తం పార్టీకి ఇది మింగుడు పడే ముచ్చటేనా? దాంతో వారు పెదవి విరవడం మొదలెట్టారు. ప్రాంతీయ పార్టీల నేతలు ప్రధాని ఎక్కడవుతారు. అసలు విజయ్‌కి అంత ఆశ పనికిరాదంటూ నీతి నిగ్రహాలు వినిపించడం మొదలు పెట్టారు. అయినా ఆలూ లేదూ చూలూ లేదు గానీ కొడుక్కు మాత్రం ఆత్మలింగమని పేరన్నట్టు కాంగ్రెస్ నేతలకు ఇంత అనహనం, ఆరాటం అవసరమంటారా? మరైతే ప్రధానిగా వుండ మని వెంటపడినా నిరాకరించిన జ్యోతిబసు, వి.పి.సింగ్ వంటి వారి సంగతి ఎలా చెప్పాలి?

**గ్రూప్ ఫోటో మార్ఫింగ్?**

సాదాసీదా మనుషుల సంగతేమోగానీ అధినేతల విషయం వేరు. అందులోనూ దేశాల నేతలైతే ప్రతి కదలికా లెక్క ప్రకారమే. వారి ముందు ఎవరు నడవాలి. పక్కన ఎవరుండాలి అన్నీ నిర్ణయమై వుంటాయి. ప్రోటోకాల్ తతంగం ఇందుకోసమే. కిర్గిస్తాన్‌లో నిన్న మొన్న షాంఘై సహకార సంఘం (ఎస్‌సిఒ) శిఖరాగ్రసభ జరిగింది. మీడియా కోసం గ్రూపు ఫోటోలు తీసుకున్నారు. ఎస్.సి.ఒ లో ఇండియా, చైనా, రష్యా, పాకిస్తాన్ వంటివన్నీ వున్నాయి. ఈ సభ నుంచి తిరిగి వెళ్లిన పాకిస్తాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ అయిదుగురు నేతల గ్రూపు ఫోటో విడుదల చేశారు. దాంట్లో షహబాజ్ మధ్యలో వుంటే అటూ ఇటూ రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ వున్నారు. ఇదైతే జరిగేది కాదు కదా? కీలకమైన అగ్రనేతలు పక్కన నిల్చుని పాకిస్తాన్ ప్రధానిని మధ్యలో నిలబెడతారా? ప్రోటోకాల్ ఏమైపోతుంది? ఈ సందేహం అందరికీ కలిగింది. ఈ లోగా ప్రధాని మోడీ కార్యాలయం అదే ఈవెంట్ ఫోటో విడుదల చేసింది. దీంట్లో షహజాబ్ గాక మరో నలుగురున్నారు. పైగా ఆయన మధ్యలో లేడు, ఒకవైపు చివర నుంచి నాలుగో వారుగా వున్నారు. ఇప్పుడు ఫోటో క్లియరైందా? సార్ ఫోటోలో ఇటు వైపు వారిని తొలగించి అంటే క్రాప్ చేసి మిగిలిన అయిదుగురినే వుంచారు. దాంతో తనే సెంట్రల్ ఫిగర్ అయిపోయారు. కానీ చూడ్డానికి సిల్లీగా లేదూ? అంతర్జాతీయ స్థాయిలో ఇంత చీప్‌గా గ్రూప్ ఫోటో మార్ఫింగ్ వ్యవహారమా?

# నేపాల్ విలయం.. ప్రకృతి ప్రతీకారం!

ఇటీవలి నేపాల్ విలయం వేలాది కుటుంబాలను విషాదాంధకారంలోకి నెట్టివేసింది. హిమాలయ మంచు కొండల శిఖరాగ్రంలో హిమానీపాతం, రాళ్లు, మట్టి కలిసి భోటేకోశీని చివరకు భయంకరమైన బురద నదిగా మార్చివేశాయి. దాంతో గత ఆగస్టు 26న నేపాల్ సహా, టిబెట్ వెంబడి పలు గ్రామాలు, పట్టణాల్లోని సరిహద్దు పోస్టులు, పెద్ద ట్రక్కులు, రహదారులు, విద్యుత్, మౌలిక సదుపాయాలు, ప్రజలను కీటకాల్లా ఆ బురద వరద మింగేసింది. పదకొండు వందల మందికి పైగా ప్రజల మరణానికి, 4,858 మంది ప్రజల అదృశ్యానికి, జీవజాలం నాశనానికి, లక్షల కోట్ల ఆర్థిక నష్టానికి ఈ విలయం కారణమయ్యింది. తమను తుడిచిపెట్టబోయే ఆ బురద సునామీ నుంచి తప్పించుకోడానికి ప్రాణభయంతో పరిగెడుతున్న చిన్న చిన్న మానవరూపాల దృశ్యాలు దిగ్భ్రాంతి కలిగించాయి. ప్రకృతి జరిపిన ఈ దాడి విస్తృతి మనల్ని ఆశ్చర్యపరుస్తోంది. ఈ తరహా దాడిని తట్టుకునే, నివారించగలిగే దృక్కోణం, సామర్థ్యం ఏ మానవ భద్రతా వ్యవస్థకూ లేకపోవడం దురదృష్టకరం.నాగాలాండ్, అస్సాం రాష్ట్రాల్లో.. జూలైలో వంద మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన వరద విపత్తుతో పోలిస్తే నేపాల్ ప్రళయం చాలా పెద్దది. ఈ రెండు సందర్భాల్లోనూ కొన్ని సారూప్యతలు ఉన్నాయి. ఇవి మారుతున్న వాతావరణ సరళి, గ్లోబల్ వార్మింగ్, పర్యావరణ మార్పులకు సంబంధించినవి. మానవ తప్పిదాలే ఈ విలయాలకు ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. ఎత్తైన హిమాలయాలలోని సున్నితమైన పర్యావరణ వ్యవస్థల ద్వారా, అలాగే దిగువ కొండలు, నదుల ద్వారా ప్రకృతి పదేపదే హెచ్చరికలు పంపినప్పటికీ, ఆ అంశాలను మనం పట్టించుకోలేదు. వాతావరణ మార్పు వచ్చేసింది, అది దాని సహజ స్థితికి తీసుకురాలేని దశకు వేగంగా చేరుకుంటోంది. తత్కారణంగా.. వేల మీటర్ల ఎత్తులో ఉన్న హిమానీనదం శిథిలమవడం వల్లగానీ, విస్ఫోటనం చెందే ప్రమాదంలో ఉన్న హిమానీనద సరస్సుల వల్లగానీ, కొండచరియలు విరిగి పడటానికి కారణమయ్యే తీవ్ర వర్షాల వల్ల గానీ, లేదా బలహీన ప్రాంతాలలో ఉధృతంగా ప్రవహించే వరద నీటి ప్రవాహం వల్ల గానీ తీవ్రమైన వాతావరణం, వర్షాలు, తుపానులు, భారీ వరదల వంటి మరిన్ని విపత్తులకు మనం సిద్ధంగా ఉండాలని ప్రకృతి చాలా కాలంగా హెచ్చరిస్తూనే ఉంది.ఆ హెచ్చరికల్ని మన పాలకులు నిర్లక్ష్యం చేస్తూ అభివృద్ధి పేర పర్యావరణ విధ్వంసాన్ని సృష్టిస్తూనే ఉన్నారు. రాజకీయ నాయకులు, వారిని పోషించే కార్పొరేట్ సంస్థలు, కాంట్రాక్టర్ల జేబుల నింపడం తప్ప మరేమీ చేయని ప్రతిష్ఠాత్మకమైన ఆరు/ నాలుగు లేన్ల హైవేలు సహా, మొత్తం హిమాలయ--టిబెట్ ప్రాంతంలోని అన్ని ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిలిపివేయాలి. సామ్రాజ్యవాది చైనా నిర్మిస్తున్న భారీ నీటి ప్రాజెక్టు, హైడ్రో ఎలక్ట్రిక్, మిలటరీ నిర్మాణాలు నిలిపివేయకపోతే ప్రకృతి క్రోధానికి ప్రజలు బలి కాకతప్పదు. ఆ నిర్మాణాల వల్ల హిమాలయ ప్రాంతం, తూర్పు పర్వతాల్లో కొండ చరియలు విరిగిపడి వేలాది మంది ప్రజలకు జీవన్మరణ సమస్యలు సృష్టిస్తున్నాయి. నేపాల్ వంటి విపత్తు సంభవిస్తుందనే భయంతో హిమాలయ ప్రాంత ప్రజలు అన్ని జల విద్యుత్ ప్రాజెక్టులనూ రద్దు చేయాలని



డిమాండ్ చేస్తున్నారు. చైనా, భారత్, నేపాల్, భూటాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి అన్ని దేశాల నిపుణులంతా ప్రమాదాలను అంచనా వేసి, రక్షణ ప్రణాళికలను రూపొందించుకోవాలి.ప్రకృతిపై మనం సాధించే విజయాల గురించి మరీ ఎక్కువగా గర్వపడకూడదు. ఎందుకంటే, అటువంటి ప్రతి విజయానికీ ప్రకృతి మనపై ప్రతీకారం తీర్చుకుంటుంది. నిజమే, ప్రతి విజయం మొదట మనం ఆశించిన ఫలితాలనే ఇస్తుంది; కానీ తదుపరి దశలలో అది పూర్తిగా భిన్నమైన, ఊహించని పరిణామాలకు దారితీస్తుంది. అవి తరచుగా ఆ తొలి ఫలితాలనే రద్దు చేసేలా ఉంటాయి. అంటే.. ప్రకృతిపై మనం ఒక విజేతలాగా ఆధిపత్యం చలాయించలేమని ప్రతి అడుగులోనూ అది మనకు గుర్తుచేస్తోంది.

ప్రపంచ దేశాలు వాతావరణ మార్పు, భూతాపం అనే సమస్యలపై ఎన్నిసార్లు అంతర్జాతీయ సమావేశాలు, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకున్నా కార్పొరేట్ శక్తుల అత్యాశకు అవి ఆచరణయోగ్యం కాకుండా పోతున్నాయి. భూగోళంలోని అన్ని రకాల జీవ--నిర్జీవ వ్యవస్థలు, ప్రక్రియలన్నీ కార్పొరేట్ సంస్థల స్వార్థానికి కోలుకోలేని విధ్వంసక స్థితికి చేరుకుంటున్నాయి. 'ప్రకృతి మన కొనసాగింపు' అనే స్పృహ, దృక్కోణం లేకుండా కేవలం మానవ అవసరాలను తీర్చే వినియోగ వస్తువుగాను, సంపదగాను ప్రకృతిని చూసే రాజకీయార్థిక విధానాన్ని విడనాడకపోతే మానవజాతి కూడా అంతరించిపోతున్న జీవరాశుల జాబితాలో చేరే ప్రమాదం ఉంది. ప్రకృతి--సమాజాల మధ్య ఆదాన ప్రదానాల క్రమాన్ని పునరుజ్జీవింపజేసే దృక్పథంతో కూడిన సమాజం కోసం ప్రజలు ఈ గ్లోబల్ కార్పొరేట్ పక్షపాత ప్రభుత్వాలను, రాజ్యాలను జెన్‌జీ ఉద్యమ స్ఫూర్తితో నిలదీయాల్సిన అవసరాన్ని నేపాల్ బురద వరద బీభత్సం నొక్కి చెబుతోంది.

# ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం అద్భుతంగా ఉంది

### తెలంగాణ గిరిజన గురుకుల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల( ములుగు జిల్లా) ప్రిన్సిపాల్ రమాదేవి




భద్రాచలం ఆగస్టు 3 నిర్భయ వార్త ప్రతినిధి. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, పాతకాలపు వస్తువులను గిరిజన మ్యూజియంలో పొందుపరచడంతో విద్యార్థినీ లకు పాతతరం గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన పెంచుకొని ఈ తరం గిరిజన పిల్లలు ఆచరించడానికి మార్గం సులభం అవుతుందని ములుగు జిల్లా గిరిజన గురుకుల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.రమాదేవి అన్నారు. గురువారం ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను ములుగు జిల్లా లోని తెలంగాణ గిరిజన గురుకుల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థినిలు, అధ్యాపకులు, సిబ్బంది విహారయాత్రలో భాగంగా ట్రైబల్ మ్యూజియం సందర్శించి మ్యూజియంలో పొందుపరిచిన గిరిజనుల అన్ని కళాఖండాలను క్షుప్తంగా తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు నేటితరం బాల బాలికలకు తెలిసే విధంగా కళాఖండాలు ఏర్పాటు చేయడంతో పాటు వాటి యొక్క చరిత్రను విద్యార్థినిలకు అర్థమయ్యే విధంగా తెలుగులో ముద్రించి ప్రదర్శించడం వలన విద్యార్థిని, విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగతమైందని, మ్యూజియంలో మాత్రం గిరిజనులకు సంబంధించిన స్పష్టమైన సమాచారం విద్యార్థులకు తెలిసే విధంగా మ్యూజియం నిర్వహకులు ప్రతి అంశం తెలియజేయడం చాలా బాగుందని అన్నారు. పాఠశాలలకు మ్యూజియం సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా అవకాశం కల్పించి విద్యార్థిని లకు ఆటవీడువుగా ఇటువంటి సందేశాలు ఉన్న గిరిజన కళాఖండాలు చూపెట్టడం వలన వారిలో మేధాశక్తి పెరిగి గిరిజన సంస్కృతి సాంప్రదాయాల గురించి పూర్తిస్థాయిలో తెలుసు కుంటారని అలాగే పాతతరం గిరిజనులు వాడే పనిముట్లు, ఆదివాసి గిరిజనుల సంస్కృతి భాష మరియు గిరిజనుల వేషధారణ కనుమరుగు కాకుండా కోయ భాషను పి ఓ రాహుల్ నేర్చుకొని భాష యొక్క అంతర్యాన్ని గిరిజనులు మరిచిపోకుండా అందరూ ఆచరించే విధంగా ఆయన చేస్తున్న కృషికి మా కళాశాల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పి దుర్గా భవాని సౌజన్య, సిబ్బంది విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ పీఓ రాహుల్ కు వైద్యుల ఆహ్వానం



భద్రాచలం సెప్టెంబర్ 3 నిర్భయ వార్త ప్రతినిధి. పారంపర్య వైద్యుల మహా సంఘం (పి.వి.ఎం.ఎస్.) తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలకు అతిథిగా రావాలని కోరుతూ ఐ.టీ.డీ.ఏ. పీ.వో బి. రాహుల్ కు పారంపర్య వైద్యులు ఆహ్వాన పత్రికను అందించారు. గురువారం భద్రాచలంలోని ఆయన చాంబర్లో ఆహ్వాన పత్రికను అందించి, మహాసభల వివరాలను తెలియజేశారు. భద్రాచలంలో ఈ నెల 8, 9 ,10 తేదీలలో (మంగళవారం నుండి గురువారం వరకు) రామాలయ సమీపంలో గల 'శ్రీ మార్కండేయ పద్మశాలి భవన్లో' జరుగనున్న రాష్ట్ర మూడవ మహాసభలకు హాజరు కావలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పిఓ నిర్వాహకులను అభినందించి ఆయుర్వేద మూలాలను సామాన్యుల వరకు తీసుకువెళ్లేందుకు కృషి చేయడం సంతోషకరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పారంపర్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్య. రామంచి శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ వైద్య. జి. సుగుణారావు, వైద్య. తూము రమేష్, దశరథ్ రజువా, కె. మహేందర్, తీగల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ఏరియా ఆదివాసి గిరిజన కుటుంబాలకు "శ్రీకృష్ణ జన్మాష్టమి" పండుగ శుభాకాంక్షలు

### ఐటీడీఏ పీవో బి.రాహుల్ సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట





భద్రాచలం సెప్టెంబర్ 3 నిర్భయ వార్త ప్రతినిధి ఆదివాసి గిరిజన గ్రామాలలో పనిచేయుచున్న అధికారులకు, వివిధ కార్యాలయాలలో పనిచేయుచున్న రెవెన్యూ గిరిజన ఉద్యోగులకు, గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు, ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేయుచున్న అధికారులకు, సిబ్బందికి, గిరిజన గ్రామాలలో నివసిస్తున్న కుటుంబాలకు, శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణుడు పుట్టినరోజు సందర్భంగా ఈ వేడుకను అన్ని గ్రామాలలో ఘనంగా జరుపుకుంటారని, హిందూ ఇతిహాసాలలో శ్రీమహావిష్ణువు ఎనిమిదవ అవతారం అని, శ్రీకృష్ణుడు జన్మ దినమును శ్రీకృష్ణ జన్మాష్టమి, గోకుల అష్టమి అని పిలుస్తారని, కృష్ణాష్టమి నాడు ప్రతి ఒక్కరు పగలంతా ఉపవాసం ఉండి, సాయంత్రం శ్రీకృష్ణుని పూజిస్తారని, శ్రావణ మాసంలో లభించే పళ్ళు ,అటుకులు, బెల్లం, కలిపిన వెన్న ,పెరుగు, మీగడ స్వామికి నైవేద్యంగా పెడతారని అన్నారు. ద్వాపర యుగంలో జన్మించిన శ్రీకృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తారని, అందుకే ఆయనను ప్రజలంతా తమ దైవంగా కొలుస్తారని, ఇంట్లో చిన్న పిల్లలు ఉంటే వారిని చిన్న కృష్ణుడితో పోలుస్తారని ,బాగా అల్లరి చేసే పిల్లలను చిన్ని కృష్ణుడు, అల్లరి కృష్ణుడు అని కొలుస్తారని, ఈ పండుగ ముఖ్యంగా చిన్నపిల్లల దేనని అన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ గిరిజన గ్రామాలలో చిన్నపిల్లలను శ్రీకృష్ణుడు గోపికల వస్త్రాధారణలతో తయారుచేసి ఊరంతా కలిసి సందడిగా ఉట్టి కొట్టి ఆనందంగా పండుగ జరుపుకుంటారని వారు తెలుపుతూ, మరి ఒకసారి అందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ శుభాకాంక్షలు తెలుపు తున్నట్లు వారు తెలిపారు.

# కారు చీకట్లో కాంతిపుంజం జగదీష్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాల....

### మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాస్






భద్రాచలం సెప్టెంబర్ 3 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలం శివారులో బలహీన బడుగు వర్గాల పిల్లల అభ్యున్నతి కొరకు కారు చీకట్లో కాంతి పుంజములా జగదీష్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాల నిరంతరం కృషి చేస్తుందని మండల విద్యాశాఖాధికారి బెక్కంటి శ్రీనివాస్ రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. పాఠశాల పర్యవేక్షణలో భాగంగా గురువారం మండల విద్యాశాఖ అధికారి ఆకస్మికంగా పాఠశాల సందర్శించారు. పాఠశాల సమయానికి కంటే ముందు పాఠశాల ఆవరణంలో చేరుకున్న మండల విద్యాశాఖ అధికారి అక్కడున్న విద్యార్థులతో సుమారు 15 నిమిషాలు ముఖాముఖి నిర్వహించి వారిలోని అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. అదేవిధంగా పాఠశాలలో పరిశుభ్రత పచ్చదనాన్ని పరిశీలించి అనంతరం విద్యార్థుల మరుగుదొడ్లను సైతం తిరిగి పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచి పాఠశాల స్వచ్ఛ మిత్ర సేవకురాలు యొక్క కృషికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. పాఠశాల విద్యార్థుల క్రమశిక్షణ చూసి ఉపాధ్యాయుల నిరంతర కృషికి అభినందనలు తెలియజేశారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజనంలో కొన్ని సూచనలు చేస్తూ మధ్యాహ్న భోజన శాల ముందు ఎం డి ఎం లోగోను వెనూ రంగులతో రాయించాలని ప్రధానోపాధ్యాయులకు సూచన చేశారు. పాఠశాల బోర్డులను చూసి ఆ వార్డుకే అందం తెచ్చే విధంగా, దారిన వెళ్లే చూపర్ల ను సైతం ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయ కృషికి అభినందనలు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ప్రాథమిక విద్య పునాది అయినటువంటి ఎఫ్.ఎల్.ఎన్ సామర్థ్యాల సాధనపై నిరంతరం కృషి చేయాలని ఉపాధ్యాయు లను ప్రత్యేకంగా కోరారు. అలాగే పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి సాయంత్రము ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిలో కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. పాఠశాలలో పాఠశాల కాల నిర్ణయ పట్టికలో ఆటలకు,సాంస్కృతిక కార్యక్రమాలకు అవకాశం కల్పించి పిల్లల్లోని అంతర్గత సామర్థ్యాలను అభివృద్ధి దిశగా పనిచేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. పాఠశాలకు ప్రత్యేక నిర్వహించే స్వచ్ఛ విద్యాలయ పురస్కార విభాగంలో అన్ని అంశాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి జిల్లా స్థాయిలో అవార్డు కైవసం చేసుకోవాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పాఠశాల ప్రార్థన కంటే 25 నిమిషాలు ముందుగా హాజరైన ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారి ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలియజేశారు. పాఠశాల పర్యవేక్షణ అనంతరం ఉపాధ్యాయ సమావేశం నిర్వహించి తరగతి గదిలో కచ్చితంగా పాటించాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు.

అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు అందరూ విద్యార్థులతో కలిసి మండల విద్యాశాఖ అధికారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజా శ్రీనివాస్, ఉపాధ్యాయులు రమాదేవి, విజయ, నాగమణి, సైదులు, ఆశలత, మాధవి స్వచ్ఛమిత్ర, మధ్యాహ్న భోజన ఏజెన్సీ రాజేశ్వరి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రజాపాలన 1000 రోజులు పూర్తి సందర్భంగా చర్లలో ఘనంగా భారీ బైక్ ర్యాలీ



చర్ల సెప్టెంబర్ 3 నిర్భయ వార్త ప్రతినిధి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో 1000 రోజులు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా చర్ల మండల కేంద్రంలో గురువారం భారీ బైక్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాల్గొని కాంగ్రెస్ శ్రేణులకు నూతన ఉత్సాహాన్ని నింపారు.టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ చీమలమర్రి మురళి ఆధ్వర్యంలో, చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు కాంగ్రెస్ సీనియర్ నాయకులు లంక రాజు, బ్రహ్మానంద రెడ్డి నేతృత్వంలో ఈ బైక్ ర్యాలీ ఉత్సాహభరితంగా కొనసాగింది.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజలకు అందిస్తున్న సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు.భారీ సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, అభిమానులు ర్యాలీలో పాల్గొని ప్రజా ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ర్యాలీ సందర్భంగా చర్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, బూత్ స్థాయి నాయకులు సర్పంచులు మాజీ ఎంపిటిసి లు ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొనడం జరిగింది.

# ఉన్నత లక్ష్యాలతో చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

## పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క





ములుగు సెప్టెంబర్ 3 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) విద్యార్థినులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని, తమ భవిష్యత్తుపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. గురువారం ఏటూరు నాగారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలను ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంత్రి పరిశీలించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి, అల్పాహారానికి ముందు నిర్వహించిన ప్రార్థనలో పాల్గొని, వారితో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, వసతిగృహ జీవితం విద్యార్థుల్లో ఐక్యత, పరస్పర సహకారం, కలిసిమెలిసి ఉండే తత్వాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. భయం, బిడియాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు దోహదపడుతుందన్నారు. తోటి విద్యార్థినులు అనారోగ్యానికి గురైనా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నా పరస్పరం ధైర్యం చెప్పుకుంటూ అండగా నిలవాలని సూచించారు. మారుమూల అటవీ గ్రామాలు, గూడాలు, తండాల నుంచి వచ్చిన విద్యార్థినులు తాము నేర్చుకున్న విజ్ఞానాన్ని కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు తెలియజేయాలన్నారు. సెలవుల్లో గ్రామాలకు వెళ్లినప్పుడు పాఠ్యాంశాల్లో నేర్చుకున్న విషయాలను స్థానిక పరిస్థితులతో అన్వయించుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తూ మూఢనమ్మకాలను తొలగించేందుకు కృషి చేయాలన్నారు. తమ చదువు గ్రామానికి ఉపయోగపడేలా విద్యార్థినులు మార్గదర్శకులుగా నిలవాలని ఆకాంక్షించారు. చరవాణిని చదువుకు ఉపయోగపడే విషయాలను తెలుసుకోవడానికి, సాధారణ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి వినియోగించుకోవాలన్నారు. పుస్తకాన్ని మంచి మిత్రునిగా భావించి, ఎక్కడికి వెళ్లినా వెంట ఉంచుకోవాలని, ప్రయాణంలోనూ తీరిక సమయాల్లోనూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలకు మంచి భవిష్యత్తు అందించాలనే ఆశతో వసతిగృహాల్లో చేర్పిస్తున్నారని, వారి ఆకాంక్షలను నెరవేర్చేలా చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలన్నారు. తాను కూడా నాలుగో తరగతి నుంచి ములుగులోని బాలికల వసతిగృహంలోనే చదువుకున్నానని గుర్తుచేశారు. విద్యార్థి దశలో ఎదురయ్యే ఆకర్షణలకు లోనుకాకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌కు తెలియజేయాలని సూచించారు. వసతిగృహంలో ఎవరికైనా జ్వరం లేదా ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ప్రిన్సిపాల్, వార్డెన్ దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు. అనారోగ్యానికి గురైన విద్యార్థినులను నేరుగా ఇళ్లకు పంపించకుండా, తల్లిదండ్రులకు సమాచారం అందించి, వారి సమన్వయంతో ఆసుపత్రిలో అవసరమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే తల్లిదండ్రులకు వైద్య సేవలు ఎక్కడ పొందాలో మార్గనిర్దేశం చేయాలని, విద్యార్థినులు పూర్తిగా కోలుకునే వరకు వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అనంతరం హెచ్‌ఎంటిసి స్థలంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా నిర్మించనున్న ఐటిడిఏ భవనానికి కేటాయించిన స్థలాన్ని మంత్రి అనసూయ సీతక్క, ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి పరిశీలించారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, గిరిజన సంక్షేమ శాఖ డిడి జనార్ధన్, కళాశాల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

### రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి. గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసిన మంత్రి.



ఖమ్మం సెప్టెంబరు 03 నిర్భయవార్త రిపోర్టర్. గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మంత్రి, కూసుమంచి మండలం కేశవాపురం గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత రెండున్నర ఏళ్లలో కేశవాపురం గ్రామానికి రూ. 4 కోట్ల నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇందులో రూ. 40 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, రూ. 3.30 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు ఎలక్ట్రికల్ లైన్లు, అంగన్‌వాడీ కేంద్రం, మంచినీటి సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేశామన్నారు. పేద మహిళలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నామన్నారు. నిరుపేదల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. మూడో విడత, నాల్గో విడత ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి అన్నారు. రైతును రాజు చేయడవే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత రెండున్నర ఏళ్లలో రైతు రుణమాఫీ, రైతు భరోసాతో కలిపి మొత్తం రూ. 1,76,000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. నిరుద్యోగ యువతకు భరోసానిస్తూ ఇప్పటివరకు 72,000 ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. మరో 11,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పథకం కింద రూ. 67,000 కోట్లు విడుదల చేశామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు.

అక్కడక్కడా ఉన్న యురియా కొరత సమస్యను ఒకటి రెండు రోజుల్లో పూర్తిగా పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసివో గంగాధర్, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, పిఆర్ ఎస్ ఈ వెంకట్ రెడ్డి, డీపీవో వినోద్ కుమార్, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కూసుమంచి మండల తహశీల్దార్ సైదులు, కేశవాపురం గ్రామ సర్పంచ్ బానోతు మమత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐఈడీ పేలుడులో మృతి చెందిన మడకం నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



ములుగు సెప్టెంబర్ 3, (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) భద్రాచలం నియోజకవర్గం వెంకటాపురం మండలం కర్రిగుట్ట సమీపంలో బుధవారం జరిగిన విషాదకర ఐఈడీ పేలుడు ఘటనలో మృతి చెందిన మడకం నాగేశ్వరరావు కుటుంబాన్ని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గురువారం పరామర్శించారు. వెదురు బొంగుల కోసం అడవికి వెళ్లిన సమయంలో ఐఈడీ పేలడంతో మడకం నాగేశ్వరరావు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వెంకటాపురం మండలానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ , చిడం మోహన్ రావు మన్యం సునీల్, చిడం శివ, రావుల నాగేంద్ర ,కిరణ్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రభుత్వంలో విప్లవాత్మక పాలన

ఎంఎంటీఎస్, మెట్రో రైలు, ఆర్టీసీ సమన్వయంతో లాస్ట్ మైల్ కనెక్టివిటీ మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. ఆటో కార్మికులు సమ్మెలోకి వెళ్లకుండా వారి న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని మంత్రి తెలిపారు. ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామనీ, వారం రోజుల్లో సమావేశం నిర్వహించి దీనిపై నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. హైదరాబాద్‌లో డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా రెట్రోఫిట్ చేసుకునేందుకు ఒక్కో వాహనానికి రూ. 1.50 లక్షల వరకు ప్రభుత్వ సహాయం అందిస్తామని తెలిపారు. బైక్ ట్యాక్సీలకు ఎల్లో ప్లేట్ ఏర్పాటు చేసే అంశంపై కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

# బ్రహ్మంగారిమఠంలో ఈశ్వరీదేవి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం.

## రూ.3 కోట్లతో నూతన ఆలయ నిర్మాణం- గుడి తొలగింపు పనులు ప్రారంభం.





బ్రహ్మంగారిమఠం, నిర్భయవార్త ప్రతినిధి :.ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మనుమరాలు అయిన శ్రీమాత ఈశ్వరీదేవి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.సుమారు రూ.3 కోట్ల వ్యయంతో ఈ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా పునర్నిర్మించనున్నారు.ఇందులో భాగంగా గురువారం నుంచి పాత ఆలయాన్ని తొలగించే పనులను కాంట్రాక్టర్ శివయాదవ్,సాంబశివారెడ్డిలు ప్రారంభించారు.భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.త్వరలోనే నూతన ఆలయానికి శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు వేగవంతం చేస్తామని పేర్కొన్నారు.



# వినాయక మండపాల అనుమతులకు ఈ-పోర్టల్

## డీజీపీ హరీష్ కుమార్ గుప్తా




అమరావతి, నిర్భయవార్త ప్రతినిధి :వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులకు ఆన్లైన్లో అనుమతులు మంజూరు చేసేందుకు సింగిల్ విండో ఈ-పోర్టల్ ఱఱఱ.స్తుఅవంష్టబ్ఖఙ.అవ్ ను ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. వివిధ శాఖల కార్యాలయాల చుట్టూ తిరగ కుండా అనుమతులన్నీ ఈ పోర్టల్ ద్వారా సులువుగా పొందొచ్చు. ఈ వివరాలను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

# ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు..

**డెంటల్ చైర్స్, సీసీ రోడ్లు, పార్కింగ్ షెడ్, కాంపౌండ్ వాల్ ప్రారంభం...**
**త్వరలో విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం: ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని.**
**ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రభుత్వ సలహాదారు షరీఫ్ తో కలిసి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎంపీ చిన్ని**



విజయవాడ నిర్భయవార్త ప్రతినిధి : (డెంటల్ కాలేజీ)ప్రభుత్వ దంత వైద్య కళాశాల ఆవరణలో సుమారు రూ.60 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ప్రభుత్వ సలహాదారుడు షరీఫ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని మాట్లాడుతూ ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కళాశాల ఆవరణలో నూతన డెంటల్ చైర్స్, 24 బెడ్లు, సీసీ రోడ్లు, పార్కింగ్ షెడ్, కాంపౌండ్ వాల్ తదితర అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు.

ప్రతిరోజూ సుమారు 500 మంది వరకు ఔట్ పేషెంట్లు (ఓపీ) దంత వైద్య సేవల కోసం ప్రభుత్వ దంత వైద్య కళాశాలకు వస్తున్నారని ఎంపీ తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.మెడికల్ యూనివర్సిటీలో కూడా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని కేశినేని శివనాథ్ చిన్ని తెలిపారు. రోగులు, వారి సహాయకుల సౌకర్యార్థం ఆర్.ఓ. ప్లాంట్, పేషెంట్ల కోసం అదనపు షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.అదేవిధంగా దంత వైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యం కల్పించేందుకు హాస్టల్ నిర్మాణం/సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చే చర్యలు చేపడుతున్నామని, త్వరలోనే హాస్టల్‌ను కూడా ప్రారంభిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని తెలిపారు.ప్రభుత్వ వైద్య సంస్థల్లో మౌలిక వసతులను బలోపేతం చేసి, పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చేయడమే తమ లక్ష్యమని ఎంపీ పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డెంటల్ కాలేజ్ మరియు హాస్పిటల్ ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరెంటెంట్ డాక్టర్ రఘునందన్ రావు హెచ్ డి ఎస్ నెంబర్ గుమ్మడి కృష్ణారావు, వివిధ విభాగాల హెచ్వోడీలు పాల్గొన్నారు

# సంక్షేమం నుంచి సాధికారత వైపు మహిళల అడుగులు!

## నైపుణ్యమే పెట్టుబడిగా... స్వయం ఉపాధే లక్ష్యంగా ముందుకు సాగాలి

## మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం.. సమాజం అభివృద్ధి: ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య





నందిగామ,నిర్భయవార్త ప్రతినిధి :మహిళల చేతుల్లో నైపుణ్యం ఉంటే ఆత్మవిశ్వాసం పెరుగు తుందని, ఆత్మవిశ్వాసం పెరిగితే స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య అన్నారు. మహిళలు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా మాత్రమే కాకుండా, తమ ప్రతిభను నైపుణ్యంగా మలుచుకుని ఆదాయం ఆర్జించే స్వయం ఉపాధి సాధకులుగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆవెం పేర్కొన్నారు. నందిగామ పట్టణంలోని అనాసాగరం గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కాస్ట్యూమ్ జ్యువెలరీ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు కూటమి నేతల తో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "చేతికి పని.. నైపుణ్యానికి గుర్తింపు.. కష్టానికి ఆదాయం" అనే ఆలోచనతో మహిళలు ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కాస్ట్యూమ్ జ్యువెలరీ తయారీకి మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందని, పెద్ద మొత్తంలో పెట్టుబడి అవసరం లేకుండానే ఇంటి నుంచే ఈ వృత్తిని ప్రారంభించి ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాన్ని కేవలం సర్టిఫికెట్‌కే పరిమితం చేయకుండా, దానిని చిన్న వ్యాపారంగా.. ఆపై అభివృద్ధి చెందుతున్న ఉపాధిమార్గంగా మలుచుకోవాలని మహిళ లకు సూచించారు. ఒక మహిళ స్వయం ఉపాధి పొందడం ద్వారా ఆమె కుటుంబానికి ఆర్థిక భరోసా లభించడమే కాకుండా, మరికొందరికి కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగవచ్చ న్నారు. మహిళా సాధికారత అంటే కేవలం ఆర్థిక సహాయం అందించడం మాత్రమేకాదని.. మహిళల్లో దాగి ఉన్న ప్రతిభ ను వెలికితీసి, నైపుణ్యాన్ని అందించి, ఆ నైపుణ్యంతో స్వయంగా ఆదాయం సంపాదించే స్థాయికి తీసుకెళ్ల డమే నిజమైన సాధికారత అని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు.ప్రస్తుత కాలంలో మార్కెట్ అవసరా లను గుర్తించి కొత్త నైపుణ్యా లను నేర్చుకోవడం ద్వారా మహిళలు తమకు తామే ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వ శిక్షణా కార్యక్రమాలను సద్వినియో గం చేసుకుని ప్రతి మహిళ తనలోని ప్రతిభను గుర్తించి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు."ఒక్క మహిళ ఎదిగితే ఒక కుటుంబం ఎదుగుతుంది.. వందలాది మహిళలు ఎదిగితే ఒక సమాజం అభివృద్ధి చెందుతుంది" అని పేర్కొంటూ, మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు.అనంతరం కాస్ట్యూమ్ జ్యువెలరీ కోర్సు పూర్తి చేసిన మహిళలను ఎమ్మెల్యే అభినందించి, శిక్షణలో పొందిన నైపుణ్యా లను ఆచరణలో పెట్టిస్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. భవిష్యత్తులోఅందుబాటులోకి వచ్చే మరిన్ని నైపుణ్యాభి వృద్ధి, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, శిక్షణ పొందిన మహిళలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యపై రాజీ వద్దు.

## స్కూల్ ఆఫ్ ఎక్స లెన్స్ కు ప్రత్యేక భవనం కావాలి.

పాడేరు,అల్లూరి జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి : ;.అల్లూరి జిల్లా పాడేరు ప్రధాన కేంద్రంలోని స్థానిక గిరిజన సంఘ భవనంలో ఆదివాసీ గిరిజన సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు అప్పలనరసయ్య ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం మారికవలస పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులను స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పేరుతో అక్కడి నుంచి తరలించి ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించాలన్న నిర్ణయం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆకాంక్షలు, ప్రజా పోరాటాలకు ప్రభుత్వం స్పందించి 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులను అదే పాఠశాలలో కొనసాగించేందుకు నిర్ణయించడం స్వాగతించదగిన పరిణామమని, దీనిని సమిష్టి విజయంగా భావిస్తున్నామని తెలిపారు.అయితే స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు తాము వ్యతిరేకం కాదని, దాని కోసం ప్రత్యేకంగా ప్రత్యామ్నాయ భవనం నిర్మించి అక్కడ నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్న గిరిజన విద్యార్థులను అదే పాఠశాలలో యథావిధిగా కొనసాగించాలని అన్నారు. ఒకే భవనంలో రెండు విద్యా విధానాలను నిర్వహించడం వల్ల విద్యార్థుల చదువుకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని, ఇప్పటికే పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు సరిగా లేవని తెలిపారు. విద్యార్థులు వాష్‌రూమ్ వంటి కనీస సౌకర్యాల కోసం కూడా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.పాఠశాల అంశంపై గత నెల రోజులుగా ఉద్యమం కొనసాగడంతో విద్యార్థులకు సక్రమంగా తరగతులు జరగలేదని, దీంతో వారు చదువులో వెనుకబడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల నుంచి అందిన సమాచారం మేరకు తాజాగా తరగతులు ప్రారంభమైనట్లు తెలిసిందని, ఇకపై విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఉద్యమ సమయంలో ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉద్యమకారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. మొన్నటికి మొన్న మారికవలస పాఠశాల వద్దకు పిల్లలను చూసేందుకు వెళ్లిన తల్లిదండ్రులతో పాటు, ఏజెన్సీ ప్రాంతం నుంచి




అక్కడికి వెళ్తున్న పలువురు ఉద్యమకారులను ప్రభుత్వం పోలీసులతో నిర్బంధించి అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లలో ఉంచారని, కక్షపూరితంగా అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు.ఇటీవల గురుకుల సెక్రటరీ గౌతమి,స్థానిక ఎమ్మెల్యే విశాఖ జిల్లా కలెక్టర్ తల్లిదండ్రుల మధ్య కొన్ని చర్చలు జరిగాయని చర్చల్లో గురుకులం పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక నిధులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెబుతోందని దీనిని మేము వ్యతిరేకిస్తున్నామని ఎందుకంటే దీనివలన ఇంగ్లీష్ మీడియం లో ఉన్న విద్యార్థులు విద్య మొదలు మౌలిక సదుపాయాలు కూడా అరకొరగానే మిగిలిపోతాయని కనుక తక్షణమే గిరిజన విద్యార్థుల భవిష్యత్తు దృశ్య స్కూల్ ఆఫ్ ఎక్స లెన్స్ కు ప్రత్యేక భవనం భవనాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వంకు ఒకటే చెబుతున్నాం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న వారిపై అక్రమ కేసులు, అరెస్టులతో భయపెట్టాలని చూస్తే వెనక్కి తగ్గేది లేదని అప్పలనరసయ్య స్పష్టం చేశారు. గిరిజనులపై చులకన భావనను ప్రభుత్వం విడనాడాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ప్రత్యేక భవనం ఏర్పాటు చేసి గిరిజన విద్యార్థుల చదువును యథావిధిగా కొనసాగించకపోతే మళ్లీ పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: హెడ్ కానిస్టేబుల్



రాజంపేట,నిర్భయవార్త ప్రతినిధి :విద్యార్థులు చిన్నతనం నుండి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ ఖాన్, మహిళా కానిస్టేబుల్ కల్పన తెలియజేశారు. గురువారం పట్టణ కేంద్రంలోని శ్రీ సాయి విద్యాలయ హై స్కూల్ నందు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శక్తి టీం రాజంపేట పోలీసులు ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు, మైనర్లు డ్రైవింగ్, ర్యాగింగ్, బాల్య వివాహాలపై అవగాహన తెలియజేసి గుడ్, బ్యాడ్ టచ్ లపై తెలియజేశారు. బాలికలు సత్ప్రవర్తన కలిగి బాగా చదువుకోవాలన్నారు. ఏదైనా సమస్యలు వస్తే తక్షణమే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అంతేకాకుండా సోషల్ మీడియాను కూడా తగు అవసరాలకు మాత్రమే వాడుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బాలరాజు, ప్రధానోపాధ్యాయురాలు రేణుకా దేవి, డైరెక్టర్లు రమణయ్య, చౌదరి, వేణుగోపాల్ విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్భయవార్త ప్రతినిధి : ఎన్టీఆర్ జిల్లా విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం దేవి శరన్నవరాత్రులు పోస్టల్ ఆవిష్కరణ.విజయవాడఇంద్రకీలాద్రికనకదుర్గమ్మ ఆలయంలో అక్టోబర్ 11 నుంచి 20 వరకు దసరా ఉత్సవాలు..!అక్టోబర్ 11న బాలా త్రిపురసుందరీదేవి, 12న గాయత్రీదేవి అలంకరణ..13న అన్నపూర్ణాదేవి, 14న మహాచండీదేవి, 15న లలితాత్రిపురసుందరీదేవిగా దుర్గమ్మకు అలంకరణ.లి16న సరస్వతిదేవిఅలంకరణ, 17న మహాలక్ష్మీదేవి, 18న దుర్గాదేవిఅలంకరణ.19నమహిషాసురమర్ధిని, 20నరాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దుర్గమ్మ దర్శనం..అక్టోబర్ 20వ తేదీ సాయంత్రం కృష్ణా నదిలో హంస వాహనంపైతెప్పోత్సవం.



# బుచ్చిలో ఓటర్ల జాబితా ప్రచురణ.



బుచ్చిరెడ్డిపాలెం, నిర్భయవార్త ప్రతినిధి,:.రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బుచ్చిరెడ్డిపాలెం పురపాలక సంఘంలోని 1--28 వార్డులకు సంబంధించిన ఓటర్ల జాబితాను గురువారం ప్రచురించారు.01.01.2026 నాటికి ఉన్న అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా రూపొందించిన జాబితాలో మొత్తం 36,438 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 17,682 మంది పురుషులు, 18,753 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు ఉన్నారు.జాబితాను మున్సిపల్, తహశీల్దార్, ఎంపీడీవో తదితర కార్యాలయాల్లో ప్రదర్శించారు. పేర్ల నమోదు, తొలగింపు లేదా సవరణలు అవసరమైతే సంబంధిత ఇఆర్‌ఓకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ అధికారులు సూచించారు.

# ఐపీఎస్ అధికారులు విశాల్ గున్ని, కాంతి రాణా టాటా లపై సస్పెన్షన్ ఎత్తివేత.





అమరావతి, నిర్భయవార్త ప్రతినిధి : సీనియర్ ఐపీఎస్ అధికారులు లివిశాల్ గున్ని (2010 బ్యాచ్), కాంతి రాణా టాటా (2004 బ్యాచ్)లిలపై ఉన్న సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. వారిని తక్షణమే విధుల్లోకి తీసుకుంటూ గురువారం సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.అఖిల భారత సర్వీసుల క్రమశిక్షణ, అప్పీల్ నిబంధనల ప్రకారం విశాల్ గున్ని, కాంతి రాణా టాటాలను ప్రభుత్వం గతంలో సస్పెండ్ చేసింది. అనంతరం వారి సస్పెన్షన్‌ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పొడిగిస్తూ వచ్చింది. తాజాగా వీరిద్దరి సస్పెన్షన్ సెప్టెంబర్ 4 వరకు అమల్లో ఉంది.ఇద్దరు అధికారుల సస్పెన్షన్ ఎత్తివేతకు సంబంధించి డీజీపీ (హెచ్‌ఓపీఎఫ్) ఇచ్చిన నివేదికలను ప్రభుత్వం పరిశీలించింది. కాంతి రాణా టాటా ఆగస్టు 24న సమర్పించిన వినతిపత్రాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నిర్ణయించింది.దీంతో విశాల్ గున్ని, కాంతి రాణా టాటాలను తక్షణమే విధుల్లోకి పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, వారిపై కొనసాగుతున్న క్రమశిక్షణ, క్రిమినల్ కేసులపై ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ పేరుతో ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇద్దరు అధికారులకు ఉత్తర్వుల ప్రతులను అందజేసి, వారి నుంచి రసీదు తీసుకోవాలని డీజీపీకి ప్రభుత్వం ఆదేశించింది.

# పరుచూరి ప్రసాద్‌కి కాలికి శస్త్రచికిత్స జరిగిందని విషయం తెలుసుకున్న,పరుచూరిని"పరామర్శించిన,, బుద్ధా వెంకన్న!"

నిర్భయవార్త ప్రతినిధి : ఎన్టీఆర్ జిల్లా విజయవాడసెంట్రల్ :కార్యకర్తలే పార్టీకి బలం.. వారి కష్టసుఖాల్లో అండగానిలవడమేనాయకత్వానికి అసలైన నిర్వచనం అని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బుద్ధా



వెంకన్న మరోసారి చాటిచెప్పారు.తెలుగుదేశం పార్టీ కోసం, కార్మికుల సంక్షేమం కోసం సుదీర్ఘకాలంగా అంకిత భావంతో పనిచేస్తున్న టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు పరుచూరి ప్రసాద్‌ను బుద్ధా వెంకన్న పరామర్శించారు.ఇటీవల పరుచూరి ప్రసాద్ కాలికి శస్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకున్న బుద్ధా వెంకన్న ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స వివరాలు, వైద్యులు అందిస్తున్న చికిత్స, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ.. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా నిబద్ధతతో పనిచేసిన పరుచూరి ప్రసాద్ వంటి సీనియర్ కార్యకర్తలు టీడీపీకి విలువైన ఆస్తి అని పేర్కొన్నారు. కార్యకర్తల కష్టం, అంకితభావం, పోరాటాల వల్లే పార్టీ బలంగా నిలుస్తోందన్నారు."ఎన్నికలప్పుడుమాత్రమే కార్యకర్త గుర్తొస్తే అది నాయకత్వం కాదు.. కార్యకర్త కష్టంలో ఉన్నప్పుడు అతని ఇంటి గడప తొక్కితేనే అది నిజమైన నాయకత్వం" అని బుద్ధా వెంకన్న పేర్కొన్నారు.పార్టీ కోసం జెండా మోసిన ప్రతి కార్యకర్తకు కష్టకాలంలో అండగా ఉంటామని, కార్యకర్తల సంక్షేమానికి ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, పార్టీ బలోపేతం కోసం పరుచూరి ప్రసాద్ అందించిన సేవలు మరువలేనివని బుద్ధా వెంకన్న అన్నారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.కార్యకర్తలే పార్టీకి వెన్నెముక!పరుచూరి ప్రసాద్‌ను స్వయంగా ఇంటికి వెళ్లి పరామర్శించిన బుద్ధా వెంకన్న.. "కార్యకర్తే ముందు.. పదవి తర్వాత" అనే సందేశాన్ని పార్టీ శ్రేణులకు ఇచ్చారని నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.కార్యకర్తల కష్టసుఖాల్లోభాగస్వామిగా నిలుస్తూ, వారికి భరోసా కల్పిస్తున్న బుద్ధా వెంకన్న తీరుపై టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.పార్టీ కోసం చెమటోడ్చిన కార్యకర్తకు కష్టం వస్తే.. నాయకత్వం అండగా ఉంటుందనే నమ్మకాన్ని ఈ పరామర్శ మరింత బలపరిచిందని పార్టీ నాయకులు తెలిపారు.

# పవన్ పుట్టినరోజు వేడుకల్లో జనసేన జోష్

**ఆలయంలో ప్రత్యేక పూజలు.. భారీ కేక్ కట్.. ప్రజలకు అన్నదానం**

బుచ్చిరెడ్డిపాలెం, నిర్భయవార్త ప్రతినిధి :జనసేనాని, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన



వేడుకలు బుచ్చి మండలంలో ఘనంగా నిర్వహించారు. జనసేన శ్రేణుల నినాదాలతో సందడి నెలకొనగా.. అభిమానుల ఉత్సాహం అంబరాన్ని తాకింది. మండల మాజీ జనసేన పార్టీ అధ్యక్షుడు దేపూరు మాధవ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు కోవూరు నియోజకవర్గ నాయకులు చప్పిడి శ్రీనివాసులు రెడ్డి, జిల్లా నాయకులు దుగ్గిశెట్టి సుజయ్, షేక్ ఆలియ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు.హముందుగా రాఘవరెడ్డి రాములువారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో, ప్రజలకు మరింత సేవ చేసేలా ఆశీస్సులు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

**అభిమానమే కాదు.. సేవా స్ఫూర్తి**

పుట్టినరోజు వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా స్థానిక ప్రజలకు అన్నదానం నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జనసేనాని ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతామని నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, సమాజ సేవకు ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా జనసేన కార్యకర్తలు తమ అభిమానాన్ని ప్రజాసేవ రూపంలో చాటుతున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పవన్ కళ్యాణ్ మరింత శక్తితో పనిచేయాలని ఆకాంక్షించారు.వేడుకల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని "జనసేనాని పవన్ కళ్యాణ్ జిందాబాద్" అంటూ నినాదాలతో సందడి చేశారు.

# కోవూరులో రాజకీయ కాక! ప్రసన్నపై టీడీపీ నేతల ఫైర్

**"విమర్శించే స్థాయి లేదు.. మరోసారి అసభ్య వ్యాఖ్యలు చేస్తే నియోజకవర్గంలో తిరగలేరు" అంటూ తీవ్ర హెచ్చరిక..**

కోవూరు, నిర్భయవార్త ప్రతినిధి :కోవూరు నియోజకవర్గంలో రాజకీయ వేడి ఒక్కసారిగా రాజుకుంది. మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలకు బుచ్చి మండల టీడీపీ యువ నేతలు ఘాటైన కౌంటర్ ఇచ్చారు.ప్రసన్నకుమార్ రెడ్డి దిగజారి రాజకీయాలు చేస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు.బుచ్చిరెడ్డిపాలెంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడిన టీడీపీ నేతలు.. మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై మండిపడ్డారు. "విపీఆర్ మగాడు కాబట్టే జిల్లాలో వైసీపీని లేకుండా చేశారు" అంటూ మాజీ మంత్రి, టీడీపీ నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి రాజకీయ హుందాతనాన్ని ప్రస్తావించారు. శ్రీనివాసులురెడ్డి గౌరవంగా రాజకీయాలు చేశారని, ఆయన పేరును ప్రసన్నకుమార్ రెడ్డి చెడగొడుతున్నారని ఆరోపించారు.



**"మీ హయాంలో దోపిడీ జరగలేదా?"**

గత ప్రభుత్వ హయాంలో ప్రసన్నకుమార్ రెడ్డి అనుచరులు నియోజకవర్గంలో దోపిడీకి పాల్పడలేదా? అంటూ టీడీపీ నేతలు ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో వవ్వేరు బ్యాంకు ప్రభావం, సహకారంతోనే ప్రసన్న ఎమ్మెల్యేగా గెలిచారని వారు ఆరోపించారు.రానున్న ఎన్నికల్లో ప్రసన్నకుమార్ రెడ్డి వెంట ఉన్న నాయకులే ఆయనకు వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. "దమ్ము, ధైర్యం ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ బలాన్ని నిరూపించుకోండి" అంటూ సవాల్ విసిరారు.

**"మీ వ్యాఖ్యలతో మీ పార్టీ నేతలే ఇబ్బంది పడుతున్నారు"**

ప్రసన్నకుమార్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలతో ఆయన పార్టీకి చెందిన నాయకులే ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ నేతలు ఎద్దేవా చేశారు. విపీఆర్‌ను విమర్శించే నైతిక స్థాయి ప్రసన్నకు లేదని అన్నారు.తమ పార్టీ నాయకులను అసభ్య పదజాలంతో విమర్శించడం సరికాదని హెచ్చరించిన టీడీపీ నేతలు.. ఇదే విధంగా మరోసారి వ్యక్తిగత విమర్శలకు దిగితే "నియోజకవర్గంలో తిరిగే పరిస్థితి ఉండదు" అంటూ తీవ్ర హెచ్చరిక చేశారు.దీంతో కోవూరు నియోజకవర్గంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరినట్లైంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ రాజకీయ విమర్శలు ఎటువైపు దారితీస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహేంద్ర, సుభహానీ, ప్రసాద్, కిషోర్, సుమన్, అక్తర్, రహమద్ బాషా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# మోదాపల్లిలో టీడీపీ ప్రచారానికి ఊపు.

**టీడీపీ అభివృద్ధి.. ఇంటింటా ప్రచారం.**



పాడేరు,అల్లూరి జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి :ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికీ టీడీపీ ప్రచార కార్యక్రమం పాడేరు మండలంలో ఉత్సాహభరితంగా కొనసాగుతోంది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి కోడా వెంకట సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం పాడేరు మండలం మోదపల్లి పంచాయతీ పరిధిలోని మోదపల్లి గ్రామంలో పండగ వాతావరణంలో ఇంటింటికీ టీడీపీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేశారు.తక్కువ మంది పార్టీ శ్రేణులతో యువనేత కోడా వెంకట సురేష్‌కుమార్ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ, ఆయనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటం టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకమవుతూ ప్రభుత్వ పథకాలను వివరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి తామర మూర్తిబాబు, కొంతేలి వెంకట ప్రసాద్, జగందొర చంటిబాబు, కున్మాల్ రావు, విష్ణు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ టీడీపీ ప్రచారం ముమ్మరం.

**దూసుకుపోతున్న టీడీపీ యువనేత సురేష్ కుమార్.**

పాడేరు,అల్లూరి జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి :ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ



అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇంటింటికీ పార్టీ ప్రచార కార్యక్రమం పాడేరు నియోజకవర్గంలో ముమ్మరంగా కొనసాగుతోంది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలనే లక్ష్యంతో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నాయి.ఇందులో భాగంగా రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పాడేరు పంచాయతీ పరిధిలోని పలు వీధుల్లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.యువనేత సురేష్ కుమార్ తక్కువ మంది పార్టీ శ్రేణులతోనే ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ ఆయనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పార్టీ నాయకులు తెలిపారు. ఎక్కడ ప్రచారం నిర్వహించినా ప్రజలు ఆసక్తిగా విని ప్రభుత్వ కార్యక్రమాలపై స్పందించడం తమకు ఉత్సాహాన్నిస్తోందన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజల్లో అవగాహన కల్పించడమే తమ ప్రచార లక్ష్యమని సురేష్ కుమార్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పాడేరు పరిధిలో ఇంటింటికీ ప్రచారాన్ని మరింత విస్తృతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి తామర మూర్తిబాబు, కొంతేలి వెంకట ప్రసాద్, జగందొర చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

# విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



పొదలకూరు, నిర్భయవార్త ప్రతినిధి :నెల్లూరు జిల్లా పొదలకూరు పట్టణంలోని విజేత స్కూల్ నందు ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణ, రుక్మిణి, సత్య భామ వేషధారణలో విద్యార్థినీ వి ద్యార్థులు పా ఠశాలలో ప్రత్యేక అకర్షనీయంగా నిలిచారు. తరువాత ఉట్టి కార్యక్రమంలో పిల్లలతో పాటు ఉపాధ్యాయులు కూడా ఆనందంగా పాల్గొన్నారు. తరువాత ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు. ఈ వేడుకలలో కరస్పాండెంట్ జి.కామాక్షి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం కరస్పాండెంట్ జి కామాక్షి శ్రీకృష్ణాష్టమి విశిష్టత ను విద్యార్థిని, విద్యార్థులకు తెలియజేశారు. శ్రీ కృష్ణాష్టమి హిందువులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్ర పండుగ శ్రీ మహావిష్ణువు ఎనిమిదవ అవతారమైన శ్రీకృష్ణుడు శ్రావణమాసం బహుళ అష్టమి నాడు రోహిణి నక్షత్రంలో అర్ధరాత్రి సమయాన జన్మించాడని పురాణాలు చెబుతున్నాయి అని ఆమె తెలిపారు. ఈ పండుగను గోకులాష్టమి, కృష్ణ జయంతి అని కూడా పిలుస్తారని, అర్ధరాత్రి నిశత కాలంలో రాత్రి 12 గంటలకు బాలకృష్ణుని విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తారని ఆమె తెలిపారు. భక్తులు ఉపవాసం ఉండి అర్ధరాత్రి పూజ ముగిసిన తర్వాత ఉపవాసాన్ని ముగిస్తారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు ఆనందంగా పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం స్వచ్ఛందంగా జీవో 97 ను రద్దు చేయాలని



నంగునూరు మండలం:నిర్భయవార్త ప్రతినిధి : రాజగోపాలపేట గ్రామం పాలిటెక్నికల్ కళాశాల నుంచి విద్యార్థిని విద్యార్థులు భారీగా సంఖ్యలో ర్యాలీగా వచ్చి ముంద్రాయి గ్రామం చౌరస్తా నడిరోడ్డు మీద రాస్తారోక చేస్తూ బతుకమ్మ ఆటపాటలతో నిరసన కార్యక్రమం చేపట్టారు

# దర్గపల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



నంగునూరు మండలం: నిర్భయవార్త ప్రతినిధి : శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని దర్గపల్లి ప్రభుత్వ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికమ్మల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ అలరించారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, చక్కటి ప్రదర్శనలు తల్లిదండ్రులను, గ్రామ ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ పెంబర్ల శైలజ రమేష్ మాట్లాడుతూ.. మన చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికలు, రాధమ్మ, వేషధారణలో పాల్గొనడం మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడానికి ఎంతో గొప్ప కార్యక్రమం. ఇలాంటి వేడుకలను ప్రతి సంవత్సరం మరింత ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయలు యాదవరెడ్డి, నాగలత, పరమేశ్వరి, పంచాయతీ సెక్రటరీ ఆంజనేయులు, వార్డు మెంబర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చైతన్య విద్యా నికేతన్ హై స్కూల్ లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు..



కుత్బుల్లాపూర్ నిర్భయవార్త ప్రతినిధి : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగద్గిరిగుట్ట మగ్గం నగర్ లో చైతన్య విద్యానికేతన్ హై స్కూల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు గురువారం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధాదేవి, గోపికల వేషధారణలో మెరిశారు. చిన్నారులు కృష్ణుల ఆటపాటలు నృత్యాలతో ప్రేక్షకులను విశేషణంగా ఆకట్టుకున్నాయి, వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన "ఉట్టి కొట్టే"కార్యక్రమం ఎంతో ఆకర్షణంగా నిలిచింది. విద్యార్థుల యొక్క ఆటపాటలతో అక్కడ పండగ వాతావరణం ఏర్పడింది. ఈ సందర్భంగా శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ శ్రీకృష్ణ విశిష్టత గురించి వివరించారు పండుగ విశిష్టత శ్రీ మహావిష్ణువు అష్టావతారాలలో పరిపూర్ణా వతారమైన కృష్ణుడు జన్మించిన రోజే కృష్ణాష్టమి.ధర్మాన్ని నిలబెట్టడానికి, దుష్ట శిక్షణ చేయడానికి కృష్ణుడు ద్వాపర యుగంలో అవతరించాడని భక్తుల నమ్మకం.భగవద్గీత ద్వారా మానవాళికి కర్తవ్యాన్ని, కర్మ సిద్ధాంతాన్ని బోధించిన జగద్గురువు కృష్ణుడు. పూజ విధానం ఉ వేడుకలు భక్తులు రోజంతా ఉపవాసం ఉండి, అర్ధరాత్రి కృష్ణుడి జనన సమయం తరువాత ప్రసాదం స్వీకరిస్తారు.లడ్డూ గోపాలుడి విగ్రహాన్ని పంచామృతాలతో అభిషేకం చేసి, కొత్త బట్టలు అలంకరిస్తారు.ఉట్టి కొట్టడం, కృష్ణ లీలలను ప్రదర్శించడం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు అని అన్నారు.

# రైతుల కళ్లల్లో కన్నీళ్లు.. కాంగ్రెస్ నిర్లక్ష్య పాలన..

## వ్యవసాయ, సాగునీటి రంగాలు సంక్షోభంలో..
## యూరియా కోసం అన్నదాతల అవస్థలు..
## రూ.15 వేల రైతుబంధు ఏమైంది?
## రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి...
## కేసీఆర్ పాలన కోసం రైతుల ఎదురుచూపులు..
## యాప్‌లో యూరియా.. చేతికందని ఎరువు...
## రైతు సమస్యలపై బీఆర్ఎస్ సమరభేరి:
## మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి





మెదక్ నిర్భయవార్త ప్రతినిధి : ఆంజనేయులు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని, వ్యవసాయ, సాగునీటి రంగాలపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు.. దాదాపు వెయ్యి రోజులు పూర్తయినా రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీల్లో అనేకం అమలు కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని పోస్టాఫీసు వద్ద వంటవార్పు నిర్వహించారు. అనంతరం రైతు సదస్సులో పాల్గొని మాట్లాడారు. సదస్సుకు తరలివచ్చిన ప్రతి రైతుకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. తెలంగాణ కోసం కేసీఆర్ 14 ఏళ్లపాటు పోరాడి, చావు నోట్లో తలపెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మలు, రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించడంతోపాటు దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రార్థనలు చేశామని తెలిపారు.తెలంగాణ ఏర్పడిన అనంతరం కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులకు ఎంతో చేశారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీటి వసతి కల్పించడంతోపాటు వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందించారని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ వంటి పథకాలను అమలు చేశారని, రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు.ప్రస్తుతం యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థలు చూస్తే బాధ కలుగుతోందన్నారు. యూరియా యాప్‌లో అందుబాటులో ఉన్నట్లు చూపుతున్నా.. దుకాణాలకు వెళ్తే ఎరువు దొరకని పరిస్థితి ఉందని విమర్శించారు. ప్రతి రైతు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేసి స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసి యాప్ ఉపయోగించడం సాధ్యమేనా? అని ప్రశ్నించారు.యూరియా పంపిణీ ప్రక్రియను రైతులకు సులభతరం చేయాలని, యాప్ నిబంధనలను తొలగించి సాధారణంగా దుకాణాల్లోనే ఎరువులు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుబంధు కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రైతుబీమా విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రైతుల కళ్లల్లో కన్నీళ్లు తెప్పించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు.పింఛన్లను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని, మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం అందిస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను కూడా మోసం చేశారని ఆరోపించారు.మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పేరుతో ఒకవైపు ప్రచారం చేసుకుంటూ మరోవైపు టికెట్ ధరలు పెంచారని, బస్సుల సంఖ్య తగ్గించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు.కేసీఆర్ పదేళ్లలో తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిందని విమర్శించారు. రైతుల కష్టాలను చూసి కేసీఆర్ గుండె తల్లడిల్లుతోందన్నారు.కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు సదస్సులు, ప్రజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ, సాగునీటి రంగాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. యూరియా పంపిణీలో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించి, ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచాలని అన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన కార్యక్రమాలను వారు వివరించారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా, సాగునీటి వసతుల కల్పన వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీటి వసతుల విస్తరణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ తరపున పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ది 6గ్యారంటీ లు 420 హామీలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



టేక్మాల్ నిర్భయవార్త ప్రతినిధి : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన . ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలకు అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు టేక్మాల్ మండల కేంద్రంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో బి ఆర్ యస్ నాయకులు కార్యకర్తలు, ప్రజలతో కలిసి ముందుగా టేక్మాల్ చౌరస్తా లో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూల మాల వేసిన అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నిరసన ప్రదర్శన నిర్వహించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలతో కూడిన భారీ ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు హోరెత్తించాయి. తెలంగాణలో అబద్ధపు హామీలతో ప్రజలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. అన్నదాతలను ఆదుకుంటామన్న కాంగ్రెస్ సర్కార్, రైతు భీమా పథకానికి తూట్లు పొడిచి మోసం చేసిందన్నారు పేదింటి ఆడబిడ్డకు అండగా నిలవాల్సిన 'కల్యాణ లక్ష్మి' పథకాన్ని తుంగలో తొక్కారు. చదువుకునే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక వారి భవిష్యత్తును అగమ్యగోచరంలోకి నెట్టారు రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా కష్టాలు మిగిలాయి ఆసరా పెన్షన్ల పెంపుదల జాడ లేదు. యువతులకు స్కూటీలు ఇస్తామన్న హామీ నీటి మీద రాతలయ్యాయనీ అన్ని రంగాల్లోనూ ఘోరంగా విఫలమైన ఈ ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు బీఆర్ఎస్ పార్టీ తరుఫున ప్రశ్నిస్తూనే ఉంటామనిమాజీ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన 6గ్యారెంటీలు 420 హామీల మోసాన్ని రాబోయే అసెంబ్లీ వేదికగా గట్టిగా ఎత్తిచూపుతామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చే వరకు ప్రజల పక్షాన నిలబడి తీవ్ర పోరాటాలు చేస్తామని సర్కార్‌ను నిలదీశారు, ఈ కార్యక్రమంలో బి ఆర్ యస్ పార్టీ మండల అధ్యక్షుడు, వీరప్ప, స్వప్న రవి, యశ్వంత్ రెడ్డి, సుప్రజ భాస్కర్, అక్బర్ పాషా, సలీమ్,సిద్దయ్య,వరలక్ష్మి, శ్రవణ్, మండల బి ఆర్ యస్ నాయకులు,యువకులు కార్యకర్తలు పెద్ద ఎత్తునపాల్గొన్నారు.



# మహేష్ మైండ్ లో రన్ అవుతోన్న ఇద్దరే ఇద్దరు!



రాజమౌళి సినిమా తర్వాత మహేష్ ఎంచుకునే ప్రాజెక్ట్ అదే స్థాయిలో ఉండాలనే ఉద్దేశంతో ఆయన మైండ్‌లో ఇద్దరే ఇద్దరు పవర్‌ఫుల్ దర్శకులు రన్ అవుతున్నారని బలమైన ప్రచారం జరుగుతోంది. సూపర్‌స్టార్ మహేష్ -దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో అడ్వెంచర్ డ్రామా -వారణాసి- జాతీయ స్థాయిలో అంచనాలు అంతకంతకంతకు పెంచేస్తోంది. సినిమా కోసం మహేష్ ప్రత్యేకమైన ఫిజికల్ మేకోవర్ పొందుతూ ప్రపంచస్థాయి వర్క్‌షాప్‌లలో పాల్గొంటున్నారు. అయితే ఈ పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ తర్వాత మహేష్ తదుపరి చిత్రం ఏ దర్శకుడితో ఉ ండబోతోంది? అనే అంశం ఇప్పటికే ఫిలిం సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. రాజమౌళి సినిమా తర్వాత మహేష్ ఎంచుకునే ప్రాజెక్ట్ అదే స్థాయిలో ఉండాలనే ఉద్దేశంతో ఆయన మైండ్‌లో ఇద్దరే ఇద్దరు పవర్‌ఫుల్ దర్శకులు రన్ అవుతున్నారని బలమైన ప్రచారం జరుగుతోంది. మరొకరు విజనరీ మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్. వీరిద్దరిలో ఒకరికే మహేష్ తదుపరి సినిమా చేసే అవకాశం ఇవ్వనున్నారని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా తీర్చిదిద్దే క్యారెక్టరైజేషన్లు, హై-వోల్టేజ్ ఎమోషన్లు హీరోల ఇమేజ్‌ను సరికొత్తగా ఆవిష్కరిస్తాయి. మహేష్‌లోని వింటేజ్ మాస్ , ఇంటెన్సిటీని బయటకు తీసే సామర్థ్యం సందీప్‌కు ఉందని అభిమానులు సైతం భావిస్తున్నారు. గతంలోనే ఇద్దరి మధ్య చర్చలు జరిగినప్పటికీ, సరైన సమయం కోసం నిరీక్షించారు.తాజాగా -వారణాసి- తర్వాత మహేష్‌ను మరో స్థాయిలో నిలబెట్టే పవర్‌ఫుల్ కథ సందీప్ వద్ద ఉందనే వార్తలు తెరపైకి వస్తున్నాయి. మరోవైపు ప్రశాంత్ నీల్ తనదైన బిగ్ స్కేల్ లార్జర్ ద్యాన్ లైఫ్ ఎలివేషన్లకు, వరల్డ్ బిల్డింగ్‌కు పేరుగాంచారు. -కెజిఎఫ్-, -సలార్- వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన ప్రశాంత్ నీల్ మేకింగ్ స్టైల్ మహేష్ మాస్ ఇమేజ్‌కు తోడైతే బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం తప్పదనే అంచనాలు ఉన్నాయి. ఇద్దరి కాంబినేషన్ కుదిరితే భారీ అంచనాలతో గ్లోబల్ వైడ్ మార్కెట్‌ను టార్గెట్ చేయడం సులువవుతుంది. రాజమౌళి కాంబినేషన్ తర్వాత ప్రతీ కథానాయకుడిపై మార్కెట్ ఒత్తిడి .. ప్రేక్షకుల అంచనాలు భారీ పెరుగుతాయన్నది వాస్తవం. అలాంటి సమయంలో ఏమాత్రం కాంప్రమైజ్ కాకుండా తన రేంజ్‌ను నిలబెట్టుకునేలా సందీప్ రెడ్డి వంగా లేదా ప్రశాంత్ నీల్‌లతో ముందుకు వెళ్లడమే సరైన వ్యూహమని మహేష్ భావిస్తున్నట్లు సమాచారం. ఇద్దరిలో ఎవరు ముందుగా మహేష్‌ను మెప్పించే స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తారో? వారితోనే ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉంది. మొత్తానికి మహేష్ భవిష్యత్తు ప్రాజెక్ట్‌లపై స్పష్టమైన ప్లానింగ్‌తో ఉన్నట్లు కనిపిస్తోంది. సందీప్ రెడ్డి వంగా అందించే ఇంటెన్స్ డ్రామానా లేక ప్రశాంత్ నీల్ సృష్టించే లార్జర్ ద్యాన్ లైఫ్ యాక్షన్ వరల్డా అనే దానిపై త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# బండ్ల గణేష్ వ్యాపార సూత్రం:

# రవితేజకు క్షమాపణ వెనుక అసలు కథ



రవితేజకు సంబంధించిన ఒక భూమి విక్రయం విషయంలో జరిగిన సంఘటనను బండ్ల గణేష్ గుర్తుచేసుకున్నారు. చిత్ర పరిశ్రమలో ప్రముఖ నిర్మాతగా గుర్తింపు పొందిన బండ్ల గణేష్ ఇటీవల నటుడు రాజా రవీంద్రతో జరిగిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో హీరో రవితేజకు క్షమాపణ చెప్పడం వెనుక ఉన్న అసలు కారణాన్ని వెల్లడించారు. వ్యాపారపరమైన అంశాలు ఉన్నా.. వారిద్దరి మధ్య ఉన్న ప్రత్యేక బంధం - ప్రేమే ఈ సారీకి ప్రధాన కారణమని ఆయన వివరించారు. సినీ రంగంలో స్నేహబంధాలు, వ్యాపార సంబంధాలు ఎలా ముడివడి ఉంటాయో ఈ సందర్భంగా ఆయన పంచుకున్నారు. రవితేజకు సంబంధించిన ఒక భూమి విక్రయం విషయంలో జరిగిన సంఘటనను బండ్ల గణేష్ గుర్తుచేసుకున్నారు. నిజానికి ఆ ఆస్తిని అమ్మడం రవితేజకు ఎంతమాత్రం ఇష్టం లేదని.. అయినా ఆయనను ఒప్పించి ఆ భూమిని అమ్మేలా చేయాల్సి వచ్చిందని తెలిపారు. అయితే ఇది కేవలం ఒక వ్యాపారపరమైన నిర్ణయం మాత్రమేనని..అందులో ఎలాంటి మోసం గానీ... దురుద్దేశం గానీ లేవని స్పష్టం చేశారు. పరిశ్రమలో సుదీర్ఘ అనుభవం ఉన్న వ్యక్తిగా తన వైఖరిని ఆయన పారదర్శకంగా వివరించారు. సినిమా పరిశ్రమలో హీరోల స్థానాన్ని, వారి మానసిక స్థితిని విశ్లేషిస్తూ బండ్ల గణేష్ ఒక ఆసక్తికరమైన పోలికను చెప్పారు. హీరోలు ఎప్పుడూ ఒక డ్యామ్ లాంటి వారని.. వారి బిజీ షెడ్యూల్స్ .. చుట్టూ ఉండే పరిస్థితులను సరిగ్గా అర్థం చేసుకుంటేనే పరిశ్రమలో ఎవరైనా సంతోషంగా ఉండగలరని వ్యాఖ్యానించారు. అలాగే కాలానికి అనుగుణంగా వచ్చే మార్పులను స్వీకరించి ముందుకు సాగడమే ఈ గ్లామర్ ప్రపంచంలో మనుగడ సాగించడానికి నిజమైన మార్గమని తనదైన శైలిలో పేర్కొన్నారు. బండ్ల గణేష్‌కు ఇండస్ట్రీలోని అగ్ర కథానాయకులందరితోనూ అత్యంత ఆత్మీయ సత్సంబంధాలు ఉన్నాయి. గతంలో ఆయన పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, మెగాపవర్‌స్టార్ రామ్ చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాస్ రాజా రవితేజ వంటి దిగ్గజ హీరోలతో భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మించి ఘన విజయాలను అందుకున్నారు. పరిశ్రమలో తిరుగులేని నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేకమైన ముద్రను వేసుకున్నారు. ముఖ్యంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తో -గబ్బర్ సింగ్- వంటి పరిశ్రమ రికార్డులను తిరగరాసిన బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని అందించిన తర్వాత ఆయనతో మరొక భారీ చిత్రాన్ని తెరకెక్కించాలని బండ్ల గణేష్ తీవ్రంగా ప్రయత్నించారు. అయితే కొన్ని కారణాల వల్ల ఆ ప్రయత్నం సఫలం కాకపోయినా పవన్ కళ్యాణ్ పై ఆయనకు ఉన్న అభిమానం, పరిశ్రమలోని ఇతర హీరోలతో ఉన్న అనుబంధం ఇప్పటికీ అలాగే కొనసాగుతుండటం విశేషం.

# రాజమౌళి.. ఈసారి ఎంత గ్యాప్?



ఇక్కడే బాహుబలి 2 టైమ్‌లైన్ గుర్తుకొస్తోంది. ఆ సినిమా కూడా అదే నెలలో వచ్చింది. కానీ రాజమౌళి తన నెక్స్ట్ హీరోల విషయంలో ఎక్కువ కాలం సైలెంట్‌గా ఉండలేదు. రాజమౌళి సినిమా పూర్తయిన తర్వాత నెక్స్ట్ ప్రాజెక్ట్ ఎప్పుడు మొదలవుతుందన్నది ఎప్పుడూ పెద్ద మిస్టరీనే. ప్రస్తుతం మహేష్ బాబుతో వారణాసి చేస్తున్నాడు. ఈ సినిమా 2027 ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక్కడే బాహుబలి 2 టైమ్‌లైన్ గుర్తుకొస్తోంది. ఆ సినిమా కూడా అదే నెలలో వచ్చింది. కానీ రాజమౌళి తన నెక్స్ట్ హీరోల విషయంలో ఎక్కువ కాలం సైలెంట్‌గా ఉండలేదు. బాహుబలి 2 2017 ఏప్రిల్ 28న విడుదలైంది. అదే ఏడాది నవంబర్‌లో ఎన్టీఆర్, రామ్ చరణ్‌తో కలిసి ఉన్న ఫొటోను రాజమౌళి బయటపెట్టాడు. అంటే దాదాపు 204 రోజుల్లోనే నెక్స్ట్ కాంబినేషన్‌పై మొదటి హింట్ వచ్చేసింది. కథ, టైటిల్ అప్పటికి బయటకు రాకపోయినా రాజమౌళి తర్వాత ఎవరితో వెళ్తున్నాడనే విషయం మాత్రం అర్థమైంది. ఇప్పుడు వారణాసి కూడా ఏప్రిల్‌లోనే వస్తుండటంతో ఈసారి ఆ గ్యాప్ ఎంత ఉంటుందనేది చూడాలి. రాజమౌళికి ఇప్పుడు రెడీగా ఉన్న హీరోల ఆప్షన్స్ చూస్తే.. తెలుగులో ముందుగా అల్లు అర్జున్ పేరు కనిపిస్తుంది. రాజమౌళి ఇప్పటివరకు బన్నీతో సినిమా చేయలేదు. పైగా పుష్ప తర్వాత అతని మార్కెట్ పాన్ ఇండియా లెవెల్లో పెరిగింది. రాజమౌళి సినిమా కోసం కావాల్సిన ఫిజికల్ వర్క్, లుక్ మార్పులు, ఎక్కువ రోజుల షూటింగ్ కూడా బన్నీ చేయగలడు. సమస్య మాత్రం డేట్స్. ప్రస్తుతం అట్లీ సినిమాతో బిజీగా ఉన్నాడు. ఆ తర్వాత కూడా లోకేష్ లాంటి వాళ్ళతో లైనప్ ఉంది. బన్నీ వెంటనే అందుబాటులో లేకపోతే తెలుగు బయట యశ్ పేరు బాగా సరిపోతుంది. ఒక సినిమా కోసం ఎక్కువ సమయం పెట్టడం అతనికి కొత్త కాదు. కేజీఎఫ్ కోసం ఏళ్ల తరబడి ఒకే ప్రపంచంలో ఉండగలిగాడు. టాక్సిక్ కోసం కూడా ఎక్కువ టైమ్ తీసుకున్నాడు. రాజమౌళి కూడా తన హీరో నుంచి అలాంటి కమిట్‌మెంట్‌నే కోరుకుంటాడు. పైగా యశ్‌కు ఇప్పటికే దేశవ్యాప్తంగా గుర్తింపు ఉంది. అయితే ఈ కాంబినేషన్ గురించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం లేదు. ఇంకో ఆప్షన్‌గా సూర్య పేరు కొంతకాలంగా వినిపిస్తోంది. పాత్ర కోసం శరీరాన్ని మార్చుకోవడం నుంచి అవసరమైతే ఎక్కువ కాలం ఒక సినిమాకు కేటాయించడం వరకు సూర్యకు ఆ ట్రాక్ ఉంది. అందుకే రాజమౌళి పేరు పక్కన అతని పేరు వచ్చినప్పుడు పూర్తిగా అబద్ధంగా అనిపించలేదు. అయినా అది ఇప్పటివరకు రూమర్ మాత్రమే. ఇద్దరి నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే ఈసారి హీరో ఎవరు అనేది పక్కన పెడితే రాజమౌళి టైమింగ్ మీద ఎక్కువ ఫోకస్ పడుతోంది. బాహుబలి 2 తర్వాత 204 రోజుల్లోనే నెక్స్ట్ కాంబినేషన్‌పై హింట్ ఇచ్చాడు. వారణాసి తర్వాత కూడా అంత కంటే ఎక్కువ టైమ్ తీసుకోకపోవచ్చని తెలుస్తోంది. స్పీడ్ గా నిర్ణయం తీసుకుంటే 2027 ముగిసేలోపే కొత్త హీరో పేరు బయటకు రావచ్చు. మరి ఆప్షన్ లో ఉన్నవాళ్ళలో ఎవరు ఫైనల్ అవుతారో చూడాలి.

# 'టాక్సిక్' మొదటి వారం వసూళ్లు ఎంతంటే!




కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, తార సుతారియా అలాగే నయనతార తదితర స్టార్ తారాగణంతో తెరకెక్కించిన లేటెస్ట్ భారీ సినిమానే టాక్సిక్. ఎన్నో అంచనాలు భారీ బుకింగ్స్ నడుమ విడుదలకి వచ్చిన ఈ సినిమా ఊహించని ఫలితాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది.అయితే మొదటి రోజే ప్రపంచ వ్యాప్తంగా 150 కోట్లకి పైగా గ్రాస్ ని అందుకున్న ఈ సినిమా ఆ తర్వాత రోజు నుంచే డీలా పడిపోయింది. ఇలా అక్కడ నుంచి మరో 150 కోట్ల గ్రాస్ అందుకోడానికి ఈ ఆరు రోజుల సమయాన్ని తీసుకున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.మొత్తం వారం రన్ పూర్తి చేసుకునేసరికి టాక్సిక్ 310 కోట్లకి పైగా గ్రాస్ ని ప్రపంచ వ్యాప్తంగా రాబట్టినట్టు కన్నడ సినీ వర్గాలు పి ఆర్ లెక్కలు చెబుతున్నాయి. ఇందులో దాదాపు సగం వసూళు హిందీ మార్కెట్ నుంచే నమోదు కావడం విశేషం. ఇక ఫైనల్ గా ఈ సినిమా ఎక్కడ వరకు వెళుతుందో చూడాలి. ఈ సినిమాకి రవి బస్రూర్ సంగీతం అందించారు అలాగే యశ్, కే వెంకట నారాయణ నిర్మాణం వహించారు.

# క్రేజీ కాంబినేషన్.. రమణ గోగుల ఇంట్రెస్టింగ్ పోస్ట్!



మన తెలుగు సినిమా వద్ద మ్యూజికల్ గా ట్రెండ్ సెట్టింగ్ కాంబినేషన్ లలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అలాగే సంగీత దర్శకుడు రమణ గోగుల కలయిక కూడా ఒకటి. వీరి కాంబినేషన్లో వచ్చిన పలు చిత్రాల మ్యూజిక్ అప్పట్లోనే అడ్వాన్స్, ట్రెండీగా సాగి యువతని ఊపేసాయి. ఇక మళ్లీ ఎన్నో ఏళ్ళు తర్వాత మళ్ళీ వీరి కాంబినేషన్లో సినిమా రాలేదు. రమణ గోగుల సినిమాలు తగ్గించడం పవన్ కూడా ఇతర సంగీత దర్శకులుతో వర్క్ చేయడంతో అన్నవరం సినిమా తర్వాత దూరం పెరిగింది.అక్కడ నుంచి వీరి కలయికలో పూర్తి ఆల్బమ్ కాకపోయినా, రమణ గోగులతో ఒక సాంగ్ అయినా పాడించాలని ఫ్యాన్స్ కోరుకునేవారు. అయితే ఇటీవల ఓజి సినిమాలో లెట్స్ గో జానీ రీమిక్స్ చేశారు. అయితే నేడు పవన్ పుట్టినరోజు సందర్భంగా విషెస్ చెబుతూ త్వరలో కలిసి పని చేస్తే ఆనందంగా ఉంటుంది అని పోస్ట్ చేయడంతో ఈ క్రేజీ కాంబినేషన్ పట్ల అభిమనులు మరింత ఎగ్జైట్ అవుతున్నారు. మరి మళ్లీ వీరి కాంబినేషన్ ఎలా సెట్ అవుతుందో చూడాలి. థమన్ గతంలో చేసినట్లు కాకుండా ఈసారి కొత్తగా ఏమన్నా ప్లాన్ చేస్తాడేమో కూడా చూడాల్సిందే.

# పిల్లల కోసమే ఎందుకు విరుష్క జంట భయపడుతున్నారు?



భారత్‌లో సెలబ్రిటీల పిల్లలు పెరగడం తీవ్రమైన సవాళ్లతో కూడుకున్న వ్యవహారంగా మారింది.భారతీయ సినీ, క్రీడా రంగాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన సెలబ్రిటీ జంట విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ (విరుష్క) భారతదేశాన్ని వదిలి లండన్‌లో నివాసం ఉండటానికి గల ప్రధాన కారణాన్ని ప్రముఖ నటి మాధురీ దీక్షిత్ భర్త, డాక్టర్ శ్రీరామ్ నేనే ఇటీవల వెల్లడించారు. ఒక ప్రముఖ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. ఈ స్టార్ జోడీ తమ పిల్లలైన వామిక, అకాయ్‌ల భవిష్యత్తు - ప్రైవసీ విషయంలో తీవ్ర ఆందోళన చెందుతున్నారని స్పష్టం చేశారు. భారత్‌లో లభించే విపరీతమైన పబ్లిసిటీ..కెమెరాల నిరంతర నిఘా వల్ల తమ పిల్లలు సాధారణ బాల్యాన్ని కోల్పోతారనే భయమే వారిని దేశం దాటేలా చేసిందని వివరించారు. భారత్‌లో సెలబ్రిటీల పిల్లలు పెరగడం తీవ్రమైన సవాళ్లతో కూడుకున్న వ్యవహారంగా మారింది. ఫోటోగ్రాఫర్లు మీడియా, సోషల్ మీడియా ట్రాకర్లు నిరంతరం అనుసరిస్తూ ఉండటం వల్ల పిల్లలకు స్కూలు వాతావరణంలో కానీ.. బయట ఆడుకునే సమయంలో కానీ సాధారణ స్వేచ్ఛ దొరకదు. తాము స్టార్ సెలబ్రిటీల పిల్లలమనే భావన చిన్నతనంలోనే వారిపై పడటం వల్ల మానసిక ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. తోటి పిల్లలతో సాధారణంగా కలవలేకపోవడం.. ఎటు వెళ్లినా కెమెరా లెన్సులు వెంటాడటం వారి సహజమైన వ్యక్తిత్వ వికాసానికి పెద్ద అవరోధంగా మారుతుందని విరుష్క జంట భావిస్తోంది. ఈ విధమైన పబ్లిక్ స్పాట్‌లైట్ - భయాన్ని ఎదుర్కొని ముందుకు సాగడం ఏ పేరెంట్ కి అయినా శ్రమతో కూడుకున్న పని. పిల్లలకు సెలబ్రిటీ ఇమేజ్ సోకకుండా సరిహద్దులు గీయడం... సోషల్ మీడియాకు దూరంగా ఉంచడం... ఫోటోగ్రాఫర్లకు ముందే విజ్ఞప్తి చేయడం వంటి జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. అయితే ఎంత కట్టుదిట్టం చేసినా భారతీయ వాతావరణంలో అనుక్షణం స్టిల్ కెమెరాల కంట పడకుండా ఉండటం అసాధ్యం. అందుకే నిరంతర నిఘా నుంచి దూరంగా ఉ ంటూ తమ పిల్లలు మిగతా అందరి పిల్లలలాగే వీధుల్లో స్వేచ్ఛగా ఆడుకునేలా.. ఎలాంటి ఒత్తిళ్లు లేని వాతావరణంలో పెరిగేలా లండన్ లైఫ్‌స్టైల్‌ను వారు ఎంచుకున్నారు. మైత్రి నిర్మాతల ఆసక్తికర వ్యాఖ్యలు డాక్టర్ శ్రీరామ్ నేనే సైతం సెలబ్రిటీ కల్చర్ వల్ల వచ్చే ఐసోలేషన్ (ఏకాకితనం) గురించి విశ్లేషించారు. అత్యధిక ప్రజాదరణ ఉన్న వ్యక్తులు ఏ పని చేసినా అందరి దృష్టిని ఆకర్షిస్తుందని... ఫలితంగా సాధారణ జీవితానికి దూరం కావలసి వస్తుందని చెప్పారు. విరాట్-అనుష్క దంపతులు తమ పిల్లలకు అటువంటి పరిమితులు లేని సాధారణ జీవితాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. పాశ్చాత్య దేశాల్లో లభించే అజ్ఞాత జీవితం వల్ల పిల్లలు ఎవరి ప్రాధాన్యతా లేకుండా... స్టార్‌డమ్ భారాలు మోయకుండా పెరిగే వెసులుబాటు లభిస్తుంది. మొత్తానికి విరుష్క జంట తీసుకున్న ఈ నిర్ణయం కేవలం విలాసవంతమైన జీవనశైలి కోసం కాదు.. ఒక తల్లిదండ్రిగా తమ పిల్లల భద్రత- మానసిక ప్రశాంతత- స్వేచ్ఛాయుతమైన బాల్యం కోసం పడిన తపనకు నిదర్శనం. సెలబ్రిటీల ప్రైవసీని గౌరవించడం.. వారి పిల్లలను సాధారణ వ్యక్తులుగా చూడటం ఎంత అవసరమో ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. విదేశాల్లో లభించే ఈ స్వేచ్ఛ తమ పిల్లలకు సరైన వ్యక్తిత్వ రూపురేఖలను ఇస్తుందనే నమ్మకంతోనే విరాట్-అనుష్క లండన్‌లో ప్రశాంతమైన జీవితాన్ని కొనసాగిస్తున్నారు. ఆసక్తికరంగా లండన్ లోని ఇస్కాన్ దేవాలయాన్ని రెగ్యులర్ గా సందర్శించే ఈ జంట ఇస్కాన్ ఆచారాలను పాటిస్తున్న సంగతి తెలిసిందే.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197